జూన్ - 2019

# పరిశుద్ధత

ఆధ్యాత్మిక మాస పత్రిక

## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| తిమోతి | కొడవటికంటి | 03 |
| శాశ్వత రక్షణ | రెవ.డా॥కె.జోసఫ్‌గారు | 06 |
| క్రైస్తవజీవిత దృక్కోణం | | 08 |
| | పి.రంజిత్ కుమార్ | |
| మార్త | రేచెల్ జోసఫ్ | 10 |
| మదర్ తెరీసా | | 12 |
| | బ్రదర్ కె. సామ్రాట్ | |
| సృష్టికర్త | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 14 |
| సాక్ష్యము | శ్రీమతి రమాదేవి | 15 |
| దేవుడు-సిరి | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 17 |
| బైబిలు కథలు- | సొలొమోను | 18 |
| | రెవ.డా॥కె.జోసఫ్‌గారు | |
| క్రొత్త కోణాలు | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 20 |
| అక్షరయజ్ఞం - | బైబిల్ క్విజ్ | 24 |
| | శ్రీమతి కె.ప్రసన్న పరాక్రమ్‌గారు | |



ప్రధాన సంపాదకులు :

**రెవ.డా॥ కె. జోసఫ్**

సర్క్యులేషన్ :

**సామ్రాట్ కొడవటికంటి**

చందా వివరాలు :

సంవత్సర చందా రూ. 250/-

పోషక చందా రూ. 1500/-

జీవితచందా రూ. 5000/-



చిరునామా :

ఎడిటర్, పరిశుద్ధత

పోస్ట్‌బాక్స్ నెం. 28, క్లాపేట, 6వలైను

ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా

సెల్ : 9704255416


బ్యాంక్ అకౌంట్ వివరాలు :

A/c Name: **K. Joseph**

A/c No.: **10957380353**

Bank: SBI Main Branch, Ongole

IFSC Code : SBIN0000890

INDIA EVANGELISTIC & RELIEF FELLOWSHIP

EVANGELISM
- Church Planting
- Evangelistic Crusades
- Pastor's Seminars
- Youth Ministry
- T.V.Ministry
- Magazine Ministry
- Audio Ministry
- Jail & Prison Ministry
- IERF International Ministry
- Hanna Women Ministries

RELIEF
- Orphanage
- Child Development Centers
- Education (U.C.L.I. Schools)
- Widows & Lepers Care
- Medical Assistance
- Help in Natural Calamity
- Flood Relief
- Mobile Medical Ministry
- Children Care Ministry

# సంపాదకీయం.....



ప్రియ పరిశుద్ధత పాఠకులకు ప్రభువు నామమున శుభాభివందనములు.

'పరిశుద్ధత' మాస పత్రికను ఆదరిస్తున్న మీ అందరికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. పత్రిక కావాలని ఆన్‌లైన్‌లో రిజిష్టరు చేసుకుంటున్నవారి సంఖ్య పెరుగుతూనే ఉంది. అయితే చందా కట్టే వారి సంఖ్య ఏ మాత్రం పెరగటం లేదు. ఇది చాలా విచారించదగ్గ విషయం. సంవత్సరానికి కేవలం 250/- రూపాయలు ఇవ్వడం ఎవరికీ భారం కాదు. ప్రభువు కార్యాలకు సహాయ పడటానికి ప్రభువు బిడ్డలను సైతం సాతాను అడ్డుకోవడం చూస్తుంటే దేవుని రాకడ ఎంత సమీపంగా ఉందో అర్థమవుతుంది. అయితే ప్రభువైన యేసుక్రీస్తు రాకడ కొరకు ప్రతి ఒక్కరినీ సమాయత్తపరచవలసిన బాధ్యత ప్రతి క్రైస్తవుని మీద ఉందని మాత్రం మరువకండి. పత్రిక నిర్వహణకు సంవత్సరానికి మాకు 3,50,000/- రూపాయలు ఖర్చు అవుతుంది. ఇది మాకు భారం అయినప్పటికీ సువార్త ప్రచురించటానికి ప్రభువుపై భారం వేసి ముందుకు సాగుతున్నాము. కాబట్టి మీ వంతు సహాయంగా పత్రిక పొందుతున్న ప్రతి ఒక్కరూ చందా కట్టవలసినదిగా ప్రభువు నామమున మిమ్మును కోరుతున్నాను.

గత కొంత కాలంగా పత్రిక చందా విషయమై అనేకమైన విజ్ఞప్తులు చేస్తూ వున్నాము. అయినా ఎవరూ స్పందించటం లేదు. దయచేసి చందా కట్టని వాళ్ళు మీ సంవత్సర చందా కట్టి పత్రిక అభివృద్ధికి తోడ్పడవలసినగా కోరుచున్నాను. మీరు నెట్ బ్యాంకింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో మనీ ట్రాన్స్‌ఫర్ చేయదలచి నట్లయితే మా అకౌంట్ నంబర్‌కి ట్రాన్స్‌ఫర్ చెయ్యండి. K. Joseph, A/c No. 10957380353, SBI Main Branch, Ongole, IFSC Code SBIN0000890. మీరు ఆన్‌లైన్‌లో మనీ ట్రాన్స్‌ఫర్ చేసినా, మనియార్డరు చేసినా దయచేసి మాకు 9440217726 నంబర్‌కి ఫోన్ చేసి చెప్పండి లేదా మీ పేరు, పత్రిక అడ్రస్ లేబుల్ మీద మీ సీరియల్ నంబర్, ట్రాన్స్‌ఫర్ చేసిన మొత్తం SMS చెయ్యండి. చందాదారుల వివరాలను పత్రికా ముఖంగా ప్రచురిస్తున్నాం. ఒకవేళ మీరు చందా కట్టినప్పటికీ మీ పేరు చందాదారుల లిస్టులో లేనట్లయితే వెంటనే మాకు తెలియజేయండి. బైబిల్ క్విజ్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని బైబిల్‌జ్ఞానం సంపాదించుకోవాలని కోరుతున్నాను. దేవుడు మిమ్మును సదాకాలము దీవించును గాక! ఆమెన్!

-ఎడిటర్

**K. Joseph, SBI Main Branch, Ongole**
**A/c No. 10957380353**

| సీరియల్ నంబరు | |
|---|---|

సీరియల్

# తిమోతి

16

**(అపొస్తలుడు మూడవభాగం)**

**- కొడవటికంటి**

ఇంకా చలికాలం ఇక్కడే గడపవలసి వస్తుందనుకొని తనలో తాను సంభాషించుకున్నాడు. కాని వచ్చిన వారం రోజుల్లోనే ప్రయాణమని తెలుసుకొని సంతోషించాడు. తార్సు పట్టణం చూడ గలుగుతున్నాననే సంతోషం. తార్సు నుండి ప్రతిరోజు ఏదో ఒక వ్యాపారంతో లుస్త్రకు జనం వస్తూనే ఉంటారు. పట్టణంలో బగ్గీ దిగగానే చాలామంది పౌలుని పలకరించారు. విశాలమైన ఖాళీ స్థలం ఉన్న భవంతి. చాలామంది పనివారు ఉన్నారు. కుడివైపు కర్మాగారం ఉంది. తయారైన డేరాలు గాలికి ఆరేసి ఉన్నాయి. ముఖద్వారానికి దూరంగానే తనకంటె కొంచెం పెద్ద వయస్సున్న వ్యక్తి గబగబ పౌలు దగ్గరకు వస్తుంటే "తాహత్" అన్నాడు పౌలు. తాహత్‌కు తిమోతిని చూపించి "తిమోతి, నా బిడ్డ" అని పరిచయం చేశాడు. తాహత్‌ని తిమోతికి చూపించి "ఈ ఆస్తికి కర్త" అని చెప్పాడు. తిమోతి ప్రశ్నార్థకంగా పౌలువైపు చూశాడు. "అదే, నా భార్య తమ్ముడు తాహత్, అన్నిటికి కర్త" అని తాహత్ వైపు ప్రేమగా చూశాడు. "ఈ సంవత్సరం చాలా లాభాలు వచ్చాయి. నేను మీకు కబురు చేశాను. మీరు యెరూషలేమునకు బయలుదేరారని తెలిసింది" అన్నాడు తాహత్. పౌలు లోపలికి ప్రవేశిస్తూ ఆ విషయాలు అంతగా పట్టించుకోలేదు. "ఎల్లుండి లుస్త్ర ప్రయాణం" అన్నాడు. మరునాడవటంతో తాహత్ తిమోతిని వెంట బెట్టుకొని పట్టణమంతా చూపించాడు. విశ్వవిద్యాలయం చూస్తుంటే మరలా చదువుకోవాలనిపించింది. చిన్నతనంలో బడికి వెళ్తుంటే నా కొడుకును తార్సులో చదివిస్తాను అని అమ్మ అంటుండేది. అదే ఇది కాబోలు అనుకున్నాడు. నాటకశాల కూడా శాస్త్రీయ పద్ధతిలో కట్టబడింది. తార్సులో ఉన్న జనమంతా పెద్ద శాస్త్రజ్ఞులులాగే అందరూ పండితుల్లాగానే కనిపించారు. ఆ సాయంకాలం షమయ ఇంటికి వచ్చారు. షమయ చాలా ప్రేమగా చూశాడు. రేపు షమయ బండిలోనే దెర్బె వెళ్ళకుండా అడ్డదారిని లుస్త్ర వెళ్తున్నట్లు చెప్పాడు. "అంతదూరం ప్రయాణం చేస్తుందా ఈ గుఱ్ఱం" అడిగాడు తిమోతి ఆశ్చర్యంగా. "బండి వెళ్తుంది కాని గుఱ్ఱం వెళ్ళదు" అన్నాడు షమయ. "అదెలా" అన్నాడు తిమోతి నవ్వుతూ. "దారిలో మనం ఎవరి గుఱ్ఱమైనా అద్దెకు తీసుకొని మన గుఱ్ఱం వారి యొద్ద ఉంచి తిరుగు ప్రయాణంలో అద్దె యిచ్చి మన గుఱ్ఱాన్ని మనం తీసుకోవచ్చు. మనం తిరిగి వచ్చే వరకు మన గుఱ్ఱం మంచి చెడులు అంతా వారే చూస్తారు" అని చెప్పాడు షమయ. "ఈ పద్ధతి బాగుంది. అయితే మనం రేపు బయలుదేరితే లుస్త్ర ఎని ౨ గంటలకు చేరతాము" అడిగాడు తిమోతి. "విన్నెరాలో రాత్రి రెండవ జాములో గుఱ్ఱం మార్చుకుంటే ఎల్లుండి మధ్యాహ్నంకి తార్సు చేరతాము" అన్నాడు.

ఇంటికి తిరిగి వస్తుంటే "మీరు కూడా మాతో లుస్త్రకు రండి" అన్నాడు తిమోతి తాహత్‌తో. "అమ్మో ఇక్కడ ఒక్కరోజు లేకపోతే వచ్చే నష్టం నెలరోజుల్లో కూడా పూడ్చలేము. అయినా మా బావ రోమా పట్టణం వెళ్ళే ఆలోచనలో ఉన్నాడు. అందుకు చాలా డబ్బులు కావాలి కదా" అన్నాడు తాహత్. "రోమా పట్టణమా?" అన్నాడు తిమోతి. మొట్టమొదటిసారి ఆ పేరు విన్నట్లు. "నాతో ఎప్పుడూ అనలేదే" అన్నాడు మళ్ళీ. "లేదు, ఆయనకు చాలా కాలం నుండి రోమా వెళ్ళాలని ఉంది. అయితే సమయం సందర్భం రావాలి కదా. అసలు మా మామగారు, అంటే పౌలు తండ్రి రెండుదార్లు ఎన్నుకోవాల్సి ఉంది. ఒకటి తన ఏకైక కుమారుని రోమా పంపించి రాజ్యాంగ శాస్త్రము చదివించటం, అందుకు అవసరమైన ధనము, పలుకుబడి కూడా

ఆయనకు ఉన్నాయి. రెండవది యెరూషలేము పంపించి రబ్బీని చెయ్యటం అనేవి. రోమా పంపిస్తే ఇప్పుడు సిసారియాలో ఉన్న అధిపతి ఫెలిక్స్ బదులుగా మా బావ పౌలు అధిపతి అయి ఉండేవాడు. యెరూషలేము పంపి రబ్బీగా తీర్చి దిద్దాలనుకున్నాడు. అలా అయివుంటే యూదా జనాంగమునకు దేవుడిచ్చిన వరమైన గమలియేలుగారి విశ్వవిద్యాలయానికి ఆయన తర్వాత ఆ స్థానము తీసికొని వుండేవాడు" అని ఆగాడు. చాలాసేపు మాట్లాడలేదు. తిమోతికి ఇవన్నీ వింటుంటే తన కళ్ళముందే తన పితృసమానుడైన పౌలు అందుకో లేనంత ఎత్తులో ఉన్నట్లుగా అనిపించింది. తాహత్ పెద్దగానే నిట్టూర్చి "ఇప్పుడు ఇలా దేశదేశాలు తిరిగి ప్రభువు సేవ చెయ్యాలని ఆయన చిత్తము కాబోలు" అన్నాడు. తిమోతి ఆలోచిస్తున్నాడు. అవును ఫెలెక్స్ కంటే గొప్ప అధిపతి అవగలిగినన్ని యోగ్యతలు ఉన్నవాడే! కాని ఫెలెక్స్ అయినా మరే అధిపతి అయినా చరిత్రలో చెప్పబడాలంటే పౌలు జీవితం ద్వారా లోకానికి తెలియ బడతారేమో. భవిష్యత్తు మనకు తెలియదు కదా! అంత గొప్ప అధిపతి పిలాతు జీవితం ఎలా ముగిసింది. రాజవ్వాల్సిన అంతిపాహేరోదు జీవితం ఎలా ముగిసిం దని. "ఈ రెండ్రోజుల్లో మీ సాంగత్యంలో ఎన్నో తెలిసికున్నాను. మీకు నా కృతజ్ఞతలు" అని చెప్పాడు తిమోతి తాహత్‌తో. తాహత్ తిమోతికి దగ్గరగా జరిగి అప్యాయంగా భుజం మీద చెయ్యివేసి "మన జీవితంలో మనము ఎందరెందరిని కలుసుకుంటామో వారందరికి దగ్గరగా చేరలేము. కొందరికి దూరమైపోతాము. ఎప్పుడు ఎవరు ఆప్తుడో, ఎవరు దూరస్థుడో మనకి తెలియదు కదా! నేను నీకంటె వయస్సులో చాలా పెద్దవాడిని పౌలుకి స్వయానా రక్తసంబంధిని. అయినా ఆయనకి నీ వలన కలిగిన ఊరట, విశ్రాంతి మరెవరి వలన కలుగలేదు" అని "పద వెళ్దాం" అన్నాడు.

లుస్త్ర చేరేటప్పటికి సూర్యుడు అస్తమిస్తున్నాడు. తిమోతి హృదయంలో ఏదో ఆరాటం ఇంటికి సమీపించే కొద్దీ బందీలో నుండి రెక్కలు విప్పి రివ్వున ఎగిరి లోయి అవ్వ ఒడిలో పడుకోవాలని, అమ్మ చేతి వంటకం తినా లని అప్పటిదాకా ఎంతో వేగంగా పరుగెడుతున్న బండి చాలా నిదానంగా నడుస్తున్నట్లుగా మనసుకు అనిపిం చింది. నిజానికి అద్దెకు తెచ్చిన గుఱ్ఱం షమయ సొంత గుఱ్ఱం కంటే పరుగులో అలవాటు కలది. ఇంటి ముందు బండి ఆగిన శబ్దం విని లోయి లేవబోయింది. కాని ఆమె వయస్సు ఆమెను లేవనీయకుండా చేసింది. "అమ్మాయ్, వీధిలో బండి ఆగింది చూడు'' అని సంతోషంతో గొంతు వణుకుతుంటే పెద్దగా అరిచింది. యునీకే పరుగున వాకిలి దగ్గరకు వచ్చి ఆశ్చర్యంగా ఆగిపోయింది. "తిమోతి, అమ్మా, అమ్మా, తిమోతి వచ్చాడే. పెద్ద తిమోతి వచ్చాడు" అంటూ పరుగున పోయి కుమారుడ్ని అక్కున చేర్చుకుంది. పెద్ద తిమోతి ఎవరూ అంటూ లోయి కర్రపోటుతో నడుస్తూ ఎదురుగా వస్తున్న తిమోతిని చూసి చేతిలో కర్ర జార్చి మనుమడిని గట్టిగా కౌగలించుకొని తలపైకెత్తి "నిజమేరా పెద్ద తిమోతి, పెద్ద తిమోతి, గడ్డం తిమోతి" అని సంతోషం పట్టలేక "ఎన్నో సంవత్సరాలలో ఎదగాల్సిందంతా ఈ సంవత్సరంలోనే ఎదిగావే" అంది. వస్తున్న పౌలు వైపు తిరిగి వంగి కాళ్ళు తాకపోయింది యునికే. పౌలు ఆప్యాయంగా ఆమెను లేపి భుజం పట్టుకొని నడిపించు కుంటూ మంచం మీద కూర్చోబెట్టాడు. "అవ్వా, నీ మనుమడు'' అన్నాడు పౌలు ఆహ్లాదంగా. ఇంత ప్రసన్నతతో నవ్వడం అరుదు అనుకున్నాడు తిమోతి. తార్సులోని తన సొంత ఇంట్లో కూడా ఇంత ఆనందం గా ఆయన కనిపించలేదు. గోడకు తగిలించి వున్న తన భార్య మీరాతో కలిసి గీయబడిన తన చిత్రపటాన్ని చూసినప్పుడు ఆయన కళ్ళలో ఇటువంటి వెలుగు చూశాను కదా! అనుకున్నాడు తిమోతి.


ఇల్లంతా హడావుడిగా వుంది. పనివాళ్ళంతా తల

ఒక పని చేస్తున్నారు. ఇంక కొంచెం ఆలస్యం అయితే లుస్త్రలో విశ్వాసులందరూ ఇక్కడే ఉంటారు. వాళ్ళు వచ్చే లోపలే భోజనాలు ముగించాలంటూ పనిచేస్తుంది తిమోతి తల్లి యునికే. అలసిపోయిన షమయ నడవలో మంచం మీద తృప్తిగా తల వాల్చాడు. తిమోతి ఆయన దగ్గరకు పెద్ద చెంబునిండా ద్రాక్షారసం తీసుకొచ్చి ఆయనతో ఆ రసం మొత్తం త్రాగించాడు. కృతజ్ఞతాపూర్వకంగా తిమోతిని చూశాడు షమయ. కళ్ళు మూసుకొని తలగడ మీద తలవాల్చాడు. ఈ రెండురోజుల బండి ప్రయాణపు అలసటంతా ఈ రసంతో తుడిచి పెట్టుకొని పోయింది అనుకున్నాడు. మరునాడు షయమ సెలవు తీసుకొని తార్సు వెళ్ళిపోయాడు. మరునాడు సంఘపెద్దల సభ జరిగింది. తిమోతి ముఖ్యమైన ముచ్చట అయ్యాడు. లుస్త్ర నుండి ఒక యౌవనస్తుడు ప్రపంచమంతా తిరిగి సేవ చేస్తున్నాడని కొందరు సంతోషిస్తే, దగ్గర బంధు వులు అబ్బాయికి వయసొచ్చింది వివాహం చేసి ఇల్లు, వాకిలి చూసుకోవాలని అన్నారు. పౌలుని అడగటానికి ఎవరికీ ధైర్యం చాల్లేదు. తిమోతి కూడ భవిష్యత్ విషయం ఏమి ఆలోచించటం లేదు. ఎఫెసు పట్టణస్తులకు ఇచ్చిన మాట ప్రకారం అయితే త్వరలోనే ప్రయాణం వుందని తెలుస్తుంది. పౌలు ఏ పట్టణంలో ఉన్నా సేవ చేసి వచ్చిన అన్ని పట్టణాలు, సంఘాలు, వారి ఇబ్బందులు బేధాలు అన్ని ఆయన మనస్సులో ఎప్పుడూ మెదులాడుతూనే ఉంటాయి. సంఘాలన్నిటిని గూర్చిన చింత దినదినం ఆయనకు కలుగుతూ వుంటుందని అంటుంటాడు. ఏదైనా ఒక పట్టణంలో పది నెలలుంటే తీతును కాని, ఎపఫ్రాని కాని, తనను కాని కొలస్సైకో, మరో సంఘానికో పంపిస్తుంటాడు. కాబట్టి పౌలు తనని తన ఇంటి వద్ద విడువడని నిశ్చయమైపోయింది. తన అవ్వ కాని, అమ్మ కాని ఈ విషయం ఆయన యొద్ద ప్రస్తావించలేదు. వారిది రెండు ప్రక్కల ధోరణి. తన కుమారుని ముఖంలో ఉన్న తేజస్సు, దైవత్వం, హుందాతనం ఇలానే కలకాలం ఉండాలని, మరియొక ప్రక్క ఇంటి వద్దనే ఉండి వివాహం చేసుకొని ఎప్పుడూ తమ కళ్ళ ఎదుటనే పిల్లాపాపలతో ఉండాలని. ఏది ఏమైనా దైవ నిర్ణయానికి బద్ధులమే కదా! అంటారు. అనుకున్నట్లుగానే ఒక వారం ఆగిన తర్వాత రాత్రి భోజనాల సమయంలో "రేపు ఉదయమే మన ప్రయాణం" అని చెప్పాడు పౌలు. 'మన' అనే మాటలోని అర్థం అందరికీ అర్థమైంది. యునికే అమ్మకి అప్పటికప్పుటే కళ్ళనుండి జలజలా నీరు కారింది కాని ఎవరికీ తెలియకుండా ముఖం ప్రక్కకు త్రిప్పుకుంది. లోయి అవ్వ నిట్టూర్చింది కాని ఏమి మాట్లాడలేదు. ఉదయాన్నే ప్రయాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. అంతా సిద్ధపడ్డారు. 'దెర్బె' నుండి వచ్చిన సహోదరులు ఇంకా తిరిగి వెళ్ళలేదు. "అమ్మా" అని పిలిచిన పిలుపుకు తలెత్తి చూశారు తల్లి కూతుళ్ళు ఇద్దరూ. పౌలు వారి వద్ద నిల్చున్నాడు. ఆయనను చూడగానే సర్దుకొని నిలుచున్నారు. ఏం చెబుతాడో అని ఆతృతగా. "తిమోతిని తీసుకొని వెళ్తున్నాను. తిమోతి నా బిడ్డే. బయలుదేరిన నాటి కంటే కొంచెం కష్టమనిపించింది. నాడు బయలుదేరేటప్పుడు తాను చాలా లేత వాడు. రకరకాల పట్టణాలు చూసి తిరిగి రావచ్చుననే కోరిక. అయినా ప్రభువు యొక్క సేవాభాగ్యం సంతోషంగా ఉంది. **(సశేషం)**

**మీరు బ్యాంక్ అకౌంట్ ద్వారా చందా పంపవలసిన బ్యాంక్ అకౌంట్ వివరాలు**

| | |
|---|---|
| **Name** | **: K. Joseph** |
| **A/c Number** | **: 10957380353** |
| **Bank** | **: State Bank of India Main Branch, Ongole** |
| **IFSC Code** | **: SBIN0000890** |

మీ చందాను నెట్‌బ్యాంకింగ్ ద్వారానే పంపాలి. చందా పంపిన తర్వాత 9440217726 కి ఫోన్ చేసి చెప్పాలి లేదా మీరు కట్టిన మొత్తము, ట్రాన్సాక్షన్ నంబరు మెసేజ్ చెయ్యాలి.



రెవ.డా॥ కె.జోసఫ్

8

# శాశ్వత రక్షణ

గమనించండి తిరిగి జన్మించేది ఆత్మయే గాని శరీరము కాదు ఆత్మ తిరిగి జన్మించినా శరీరము బ్రతికే ఉంటుంది కాబట్టి శరీరము కూడ పనిచేస్తుంది. అందుకే ఆత్మకు శరీరానికి పోరాటమని పౌలు స్పష్టంగా వివరించాడు. క్రైస్తవులు తీర్పు పొందుదురా? జవాబు 1కొరింథీ 3:8-15. యోహాను భక్తుడు తన పత్రిక (1యోహాను 1:9)లో క్రైస్తవులను ఉద్దేశించి వ్రాసినదేమిటంటే "మనము" పాపము లేని వారమని చెప్పుకొనినట్లయితే అని వ్రాశాడు. విశ్వాసి తిరిగి జన్మించి నప్పుడు ఆత్మ తిరిగి జన్మించింది. కాని శరీర కార్యాములతో పుట్టుకతో వచ్చిన శరీరము కూడా జీవించే ఉంటుంది. కనుక ఈ రెండింటికి పోరాటం. నూతనంగా జన్మించిన ఆత్మ అనగా దేవుని ఆత్మ మన ఆత్మతో సంధించినప్పుడు తిరిగి జన్మించిన ఆత్మ అనగా దేవుని బీజము మూలముగా జన్మించిన ఆ ఆత్మ (అంతరంగ పురుషుడు లేక జీవుడు). రక్త మాంసము వలన వాడు కాదు. కనుక పాపము చేయడు, పాపము చేయజాలడు (1యోహాను 3.9). కనుకనే నూతన పురుషుడు పాపము చేయడు గాని మనలో ఉన్న ప్రాచీన పురుషుడు మనలను పాపములో పడవేస్తుంటాడు. కనుక విశ్వాసులు కూడా పాపము చేస్తుంటారు. దానికి తీర్పు తీర్చబడతారు. కుమారుని యందు విశ్వాసముంచిన వాడు నిత్యజీవము గలవాడు. మరణములో నుండి జీవములోనికి దాటియున్నాడు. మరలా జీవములో నుండి మరణములోనికి రాడు. అది అసంభవము. ఏదెను తోటలో ఆదాము పాపము చేసిన తరువాత, అతనిని తోటలో నుండి వెళ్ళగొట్టే ముందు పలికిన మాటను పరిశీలిం చండి."కాబట్టి అతడు ఒకవేళ తన చెయ్యి చాచి జీవవృక్ష ఫలములను కూడ తీసికొని తిని నిరంతరము జీవించునేమో" అని వెళ్ళగొట్టాడు. ఏం? దేవుడు తింటే మాత్రము చంపలేడా? చంపడు. తన నైజమునకు విరుద్ధంగా దేవుడు ఏది చేయడు. జీవవృక్ష ఫలమనకు ఆ గుణము దేవుడు పెట్టాడు. దానిని తీసివేయడు. అలాగే నిత్యజీవము అంటే ఎల్లప్పుడు వుండేది. దానిని దేవుడు తీసివేయడు. మన దేవుడు ఒకసారి ఇచ్చి మళ్ళీ తీసుకొనడు. మన అల్ప బుద్ధితో దేవుని నైజమును (జ్ఞానమును) తెలిసికొనలేక పోతున్నాము. అందుకే పౌలు "దేవుని గూర్చిన జ్ఞానము కొందరికి లేదు" (1 కొరింథీ 15:34) అని వ్రాశాడు (హోషేయ 4:6, 6:3).

విశ్వాసులమైనప్పటికి మనలో తప్పిదములు ఉంటునే ఉన్నవి. అయినప్పటికి మనము యోనా లాగా, తప్పిపోయిన కుమారుని చరిత్రలో పెద్దకుమారునిలాగా ఆలోచిస్తుంటాము. కాని పరమతండ్రి అపారమైన ఆశ్చర్యకరమైన ప్రేమ (అంటే మనకంతుపట్టని ప్రేమ) కలిగిన దేవుడు కుమారులను వారి తప్పులను బట్టి శిక్షిస్తాడే గాని నశింపజేయడు. (కీర్తనలు 89:30-34) అందుకే తన కుమారుని మన కొరకు బలి చేసింది. ఆత్మ ద్వారా తిరిగి జన్మింపబడ్డాము. మనము దేవుని కుమారులము అనే వచనములలో ఈ సత్యము తెలియ బడుతుంది. మన దేహములు రూపాంతరం పొంది పూర్తి విముక్తి పొందేంత వరకు పరిశుద్ధాత్ముని ద్వారా భద్రపరచబడి యుగయుగములకు రక్షణ కలిగి యున్నాము. కనుక మన రక్షణ శాశ్వతముగా భద్రపరచియున్నది (అపొకా 13: 38-39, ఎఫెసీ 1:7, యోహాను 5:24, 1పేతురు 1:23, యోహాను 1:12, గలతి 3:26, ఎఫెసీ.1:13-14, ఫిలిప్పీ.3:21). ఈ వచనములన్ని దయచేసి చదవండి.

ముందు చెప్పినట్లుగా నిత్యజీవము క్రీస్తు నీతి మనకు

జమ చేయుటవలన బహుమానముగా (దానము) యివ్వ బడినది. ఇప్పుడు ప్రతిఫలము అనే విషయాన్ని ఇంకా ఆలోచించినట్లయితే మనము భూలోకములో క్రైస్తవులముగా జీవించిన జీవితమంతా క్రీస్తు న్యాయ పీఠము యెదుట పరిగణలోనికి వస్తుంది. పౌలు భక్తుడు క్రైస్తవ జీవితమును బహుమతి కొరకై పరిగెత్తె పందెంగా పోల్చాడు. తాను అక్షయ కిరీటము పొందుటకై పరుగెత్తుచున్నాను అని వ్రాసాడు. ఈ పరుగు పందెములో జయం పొందే వారందరు ఈ విధమైన ఫలము పొందుతారని 1కొరింధీ.9:24-27 వచనాలలో వివరించబడినది. ఈ కిరీటము క్రీస్తు వెయ్యేళ్ళ పరిపాలనలో విశ్వాసులు పొందే ఇతర కిరీటాలవలె ఇవ్వబడుతుంది. (1థెస్స.2:19, 2తిమోతి 4:8, యాకోబు 1:12, 1పేతురు 5:2-4, ప్రకటన 2:10, 2:27, 3:21, 20:4-6). ముందు చదువబోయే విషయాలు ఇంకా బాగా వివరిస్తాయి. జయించిన విశ్వాసులు ఆయన రూపం ధరిస్తారు. ఆయనతో వెయ్యేళ్ళు పరిపాలిస్తారు. ఇది మానవుని సృష్టించుటలో దేవుని ముఖ్యఉద్దేశ్యమును పూర్తి చేస్తుంది. దాని తరువాత ప్రకటన 22లో చెప్పబడిన సంగతులు చోటు చేసుకుంటాయి. ( ఆది. 1:26, కీర్తన 8:4-6) ఈ భాగ్యమును పొందుటకై మోషే భక్తుడు ఐగుప్తులోని గొప్ప భోగమును విసర్జించి క్రీస్తు నిమిత్తమైన నిందే గొప్ప భాగ్యమని ఎంచుకున్నాడు. హెబ్రీ 11:24-26, 1కొరింధీ.6:24,27లో పౌలు భక్తుడు తాను భ్రష్టుడనై పోతానేమోనని తన శరీరమును నలుగగొట్టి లోబరుచుకొనుచున్నాను అని వ్రాసాడు. కాని ఉచితంగా పొందే నిత్యజీవమనే బహుమానమును గూర్చి కాదు. తాను నిత్యజీవము కొరకు పోరాడుట లేదు. తాను ప్రభువును అంగీకరించినప్పుడే ఆ నిత్యజీవము పొందాడు. నేను ఇప్పుడు చనిపోతే ప్రభువుతో ఉంటానని చెప్పాడు. అయితే ఇప్పుడు క్రైస్తవ జీవితంలో అక్షయ కిరీటము పొందుటకు పరిగెత్తు చున్నాడు. దీనిని విశ్వాసులలో అనేక మంది పౌలు నిత్యజీవ మును పోగొట్టుకుంటాడేమోనని పరుగెత్తుచున్నాడని తప్పుగా అర్థంచేసుకుంటారు.

రాబోవు రాజ్యము గురించి పాత నిబంధనలో ప్రవచన ములుగా చెప్పబడినవి. అది గొప్ప ఆశీర్వాదముగా పొంద గలము అని చెప్పబడినది. భూగోళము శాపవిముక్తి పొంది మెస్సయ్య ఏలుబడిలోనికి వెయ్యేండ్ల పరిపాలన లోనికి వచ్చును అని చెప్పబడినది (యెషయా 2:1-4, 11:1-10, 24:23). దీనినే యూదులు పునరుత్థానము తరువాత దేవుని యొక్క తీర్పు పొందుతారని నమ్ముతారు. ఇదే నిత్యజీవమని వారి నమ్మకం (దాని.12:2). ఇక్కడ మనం గమనించవలసిన విషయమేమంటే నిత్యజీవం అనే మాటకు లేఖనములలో చాలా అర్థాలు కలవు. గ్రీకు, హెబ్రూ భాషలలో "అంతములేని" మరియు "నిత్యజీవము" అని పూర్తిగా అర్థమిచ్చే మాటలు లేవు. హెబ్రూ భాషలోని "ఓలము" మరియు గ్రీకు భాషలలోని "అయోనియస్" అనే మాటలు నిత్యజీవము, కాలము లేని యుగము అనే అర్థమిస్తాయి. ఈ మాటలు సందర్భాను సారముగా అనువర్తించుకొవాలి. ''యుగము'' అని వ్రాయబడినప్పుడు దానికి కాలపరిమితివుంది. కొన్నివేల సంవత్సరాలైతే ఒక యుగము. అందుకే యుగయుగములు అన్నారు. దేవుని గూర్చి చెప్పబడినప్పుడు ఆయన ఆది అంతము లేని వాడు కాబట్టి శాశ్వతము (ఆది అంతము లేని వాడు) అని అర్థం చేసుకోవాలి (ఆది.21:33, యోహాను 1:1-4, రోమా 16:26 1తిమోతి 6:15-16, హెబ్రి.1:10,12,7:3, 1యోహాను 1:1-2, 15:17). దేవుని ద్వారా నిత్యజీవము పొందిన మనం ఆయనతో నిత్యమైన సంబంధం కలవారమై నిత్యరక్షణలో కొనసాగుతాము (యోహాను 3:14-16, 5:24. రోమా 6:23).

క్రీస్తు కాలమందు ఉన్న యూదులు "నిత్యజీవము"ను మారుమనస్సు పొంది నూతన జన్మ ద్వారా పొందగలము అనే సత్యాన్ని గ్రహించలేకపోయారు. ఉదాహరణకు నీకొదేము పాత నిబంధనలో మెస్సయ్యను గూర్చిన ప్రవచనములను బట్టి మెస్సయ్య ద్వారానే నిత్యజీవము అనే రాజ్యము కొరకు ఎదురు చూస్తున్న వాడు. నూతన జన్మ గురించి ఏ మాత్రము అవగాహన లేని వాడుగా కనబడుచున్నాడు. అందుకని ఒకడు తల్లి గర్భములో తిరిగి ప్రవేశింపగలడా? అని ప్రశ్నించాడు (యోహాను 3:3-10).

**(సశేషం)**

2

# క్రైస్తవ జీవిత దృక్కోణం

మార్కు 14:3-7లో ఉన్న సన్నివేశము మనకు కొన్ని సత్యాలను వివరిస్తుంది. ఇక్కడ మనకు కనిపిస్తున్నవి. 1) విలువైన అత్తరు బుడ్డి 2) యేసు చుట్టు వున్న మనుష్యులు 3) ఒక స్త్రీ 4) యేసు ప్రభువులవారు

**విలువైన అత్తరు బుడ్డి:**

బైబిల్‌లో అత్తరు బుడ్డి విలువను గూర్చి చాలా స్పష్టంగా వ్రాయబడివున్నది. అనగా అది చాలా ఖరీదు కలిగినటువంటి అత్తరు. ఆ కాలంలో 161 రూపాయలు విలువ చేసే అత్తరు అనగా అది ఎంతో విలువైనది. ఇక్కడ మనం కొన్ని విషయాలు పరిశీలిద్దాం. ఈ విలవైన అత్తరు బుడ్డిని మన జీవితంతో పోల్చుకుందాం. నిజమే జీవితం ఎంతో విలువైనది. ఈ సత్యాన్ని ప్రతి ఒక్కరం ఖచ్చితంగా అంగీకరించి తీరాలి. మన జీవితాన్ని లేదా మన శరీరాన్ని దేవుడు ఎంతో గొప్పగా అరుదుగా తయారు చేశాడు. మనలాంటి వారు భూమి మీద మరొకరు వుండరు. మనలాంటి వేలిముద్రలు మరొకరితో సరితూగవు నీవు నీవే.

**యెషయా: 13:12 " బంగారము కంటె మనుష్యులను ఓఫీరు దేశపు సువర్ణము కంటె నరులను అరుదుగా ఉండజేసెదను"**

మనం చాలా అరుదైన ప్రాముఖ్యమైన జీవరాశులుగా దేవుడు మనలను నిర్మించాడు. మనలను అలాగే కాపాడుతున్నాడు. చూడండి భూమి మీద ఏవైన అరుదైన జీవరాశులు వున్నట్లైతే ప్రభుత్వం వారు వాటిని కాపాడటానికి లేదా సంరక్షించటానికి ఎన్నో చర్యలు తీసుకుంటు వుంటారు. అంతమాత్రమే కాదు వాటి కొరకు ప్రత్యేకమైన బడ్జెట్ కూడా ప్రవేశపెడతారు. అలాగే మానవుని జీవితం అంతకన్న శ్రేష్ఠమైనది. ఈ విషయం మనకు తెలియాలి అంటే మనం ఖచ్చితంగా హాస్పిటల్‌లో జాయిన్ అవ్వాలి. అప్పుడు మీకు చాలా స్పష్టంగా అర్థం అవుతుంది. మన శరీరంలో దానిలో వున్న జీవితం ఎంత విలువైనదో అర్థం అవుతుంది. ఎన్నో నెలలు, సంవత్సరాలు మీరు కష్టపడి సంపాదించిన డబ్బు ఒక్క క్షణంలో మీ దగ్గర నుండి మాయమైపోతుంది. కాబట్టి నీ విలువ నీకు అర్థంకావటం లేదు. నీ కన్నును పరిశీలించినట్లయితే అది ఎంత గొప్పదో మనకు అర్థం అవుతుంది. ఏ కెమెరాలు పనిచేయలేనంతగా మన కన్ను పనిచేస్తుంది. దాదాపు 50,000 పై చిలుకు రంగులను నీ కన్ను గుర్తించగలదు. దాదాపుగా 130 మిలియన్ పిక్సెల్స్ దృశ్యాలను రికార్డు చేయగలదు. అంత అధునాతనమైన కెమెరాను నువ్వు కొనాలంటే ఎన్ని లక్షలు వెచ్చించాలి. కాని నీ దేవుడు నీకు చాలా విలువైన కన్నులను బహుమతిగా నీకు అనుగ్రహించాడు. అంత మాత్రమే కాదు నీ గుండెను ఒకసారి పరిశీలించు. అది చేసే చప్పుడు, కదలికలను పరిశీలించు. దానిని ఏవరు కదిలిస్తున్నారు. నీ జీవిత కాలంలో నీ గుండె దాదాపుగా 60,000 మైల్స్ నీ రక్తాన్ని సరఫరా చేస్తుంది. ఆడవారిలో మరియు మగవారిలో గుండె కొట్టుకొనే సంఖ్యలో ఎంతో తేడావుంది. ఒక్కరోజు నీ గుండె ఉత్పత్తి చేసే శక్తి వలన ఒక లారిని దాదాపు 20 మైళ్ళ దూరం నడిపించవచ్చు. అదే నీ జీవిత కాలం గుండె కొట్టుకుంటే దానివలన వచ్చే శక్తి వలన మనం చంద్రుడి మీదకు వెళ్ళి తిరిగి రావచ్చు. అంత గొప్ప శక్తి నీ గుండె విడుదల చేస్తుంది. మానవుడి మెదడు ఇది ఎంతో గొప్పది. మనం నిద్రపోయినప్పటికి ఇది పనిచేస్తూనే వుంటుంది. ఇది పనిచేయక పోతే మనం అంతే. బంగారపు ఉంగరాన్ని కూడా పిచ్చిరాయిలా పడవేస్తాము. అయితే ఒక సగటు మానవుడు తన బ్రైన్ సామర్థ్యంలో కేవలం

10-20% మాత్రమే ఉపయోగిస్తున్నాడని ఒక సర్వే ప్రకటించింది. అంటే కేవలం 20% ఉపయోగిస్తేనే మానవుడు ఎన్నో అద్భుతాలు చేస్తువుంటే మరి 100% ఉపయోగిస్తే ఇంకా ఎన్ని అద్భుతాలు చేస్తాడు. చూశారా మీ అవయవాల పనితీరును మీరు పరిశీలించినప్పుడు మీరు ఎంత గొప్పవారో, మీరు ఎంత విలువ కలిగిన వారో అర్థం అవుతుంది. కాబట్టి దేవుని దృష్టిలో మీరు చాలా విలువైన వారు. మిమ్ములను మీరు తక్కువ చేసుకొనవద్దు. దేవుని దృష్టిలో నీవు చాలా విలువ గలిగిన వాడవు. అందుకే దావీదు ఇలా అంటాడు. కీర్తనలు:119:73. “నీ చేతులు నన్ను నిర్మించి నాకు రూపు ఏర్పరచెను.” మనకు, మన శరీరము కాని జీవితం కాని దేవుని దయవలన ప్రసాదించబడినది. అది ఎంతో విలువైనది. కాని మానవుడు ఈ లోకంలో విచిత్రంగా ప్రవర్తిస్తున్నాడు. ఆయన ఏవరో తెలియక తన సొంత నిర్ణయాలను, ఆలోచనలను మనం అవలంభించు కుంటున్నాము. తద్వారా మనకు నష్టమే తప్ప ఎటువంటి లాభము మనకు కలుగుటలేదు.

చూడండి, మానవుని ఊహ వచ్చినప్పటినుండి పసిపిల్ల వానిగా ఉన్నప్పుడు కార్టున్ చానెల్ ఇష్టపడతాడు. యవ్వన దశ వచ్చినప్పుడు ఫ్యాషన్ చానెల్ ఇష్టపడతాడు. గృహస్తుడు అయినప్పుడు న్యూస్ చానెల్స్ చూస్తాడు. వృద్ధాప్యంలో వున్నపుడు భక్తి చానెల్స్‌ను చూస్తాడు. చూశారా దశలు మారే కొద్ది తన అభిరుచులను మార్చుకుంటూ పాత అభిరుచులు వ్యతిరేకిస్తాడు. దీనిని బట్టి మానవుని ఆలోచనలు స్థిరమైనవి కావు అని మనకు చాలా స్పష్టంగా అర్థం అవుతుంది. నీవు స్థిరమైన వాడివి కాకపోయిన నిన్ను నిర్మించిన నీ దేవుడు శాశ్వతమైనవాడు. ఉన్నతమైనవాడు. ఆయన నిన్ను విడిచిపెట్టడు. ఈ అత్తరు బుడ్డిని చాలామంది వివిధ కోణాలలో చూశారు. అలాగే మీ జీవితాన్ని కూడా చాలామంది వివిధ కోణాలలో చూస్తువుంటారు. వారిలో మొదటిగా –

యేసు దగ్గర వున్న కొంతమంది:– ఆ అత్తరు బుడ్డిని డబ్బు రూపంలో చూశారు. మరియు ఆ డబ్బును ఎందుకు ఉపయోగించుకోవాలో కూడా ఆలోచన చెబుతున్నారు. నేటి కుటుంబం లేదా సమాజం మానవుని జీవితాన్ని డబ్బు సంపాదించే వారిగానే చూస్తూవుంది. అనగా మన ఎదుగుదల, మన పలుకుబడి, మన గౌరవం కేవలం డబ్బు మీద ఆధారపడి వుంటుంది. అనగా నీవు డబ్బు సంపాదించలేకపోతే నిన్ను చేతకాని వాడిగా ఈ లోకం ఎంచుతుంది. అంత ఎందుకండి కుటుంబ సభ్యులు కూడా డబ్బు సంపాదిస్తేనే గౌరవిస్తారు. లేకపోతే రోజు ఆ వ్యక్తి ఇంటిలో నరకం అనుభవిస్తాడు. అనగా మనిషిని మనిషిగా చూడలేరు. వారిని మనీ మేకింగ్ మిషన్ గానే చూస్తూ వుంటారు. కాబట్టి పిల్లలు పుట్టినప్పటినుండి వారిని చదువు, ఉద్యోగం, సంపాదన అనే మూడు పదాలు ఉగ్గు పాలలో కలిపి పెంచుతారు. వారు పెద్దవాడైన తరువాత కూడా కేవలం ధనార్జనే ధ్యేయంగా పనిచేయడం మొదలు పెడతాడు. అలాంటివాడు సమాజంలో ఎన్నో అకృత్యాలకు ఎన్నో పాపాలకు పాల్పడతాడు. తద్వారా జీవితం అంధకార మయం చేసుకుంటున్నాడు.

**(ఇంకావుంది)**

## -: పాఠకులకు గమనిక :-

**ఫేస్‌బుక్, ఆన్‌లైన్ తెలుగుబైబిల్ వెబ్‌సైట్, బైబిల్ క్విజ్ ద్వారా ఒక సంవత్సరం పాటు ఉచితంగా పత్రిక పొందుతున్న పాఠకులకు సంవత్సరం ముగిసిన వెంటనే వారికి పత్రిక నిలిపివేయడం జరుగుతుంది. కాబట్టి ముందు గానే సంవత్సర చందా రూ.250/– కట్టి రెన్యువల్ చేసుకోవడం ద్వారా 2 సంవత్సరాలు పత్రిక పంపబడుతుంది. పాఠకులు సహృదయంతో అర్థం చేసుకొని వెంటనే సంవత్సర చందా పంప గలరు.**

**–ఎడిటర్**

స్త్రీల విభాగము

# మార్త



శ్రీమతి కె. రేచల్ జోసఫ్,
హన్నా ఉమెన్స్ ప్రెసిడెంట్

బేతనియ అనే గ్రామంలో మార్త అను ఒక స్త్రీ ఉంది. ఆమెకు మరియ అనే ఒక సహోదరి, లాజరు అనే ఒక తమ్ముడు కూడా ఉన్నారు. వీరు ముగ్గురూ ఒకే ఇంటిలో ఉంటారు. ముగ్గురిలో మార్త పెద్దది. అందుకే ఇంటి పనులన్ని చూసుకోవడం, వంట పనులన్నీ చేసుకోవడం ఆమెకు అలవాటయి పోయింది. చాలా చురుకైంది. ఎవరైనా ఇంటికి అతిధులొస్తే మరిన్ని మధురమైన వంటకాలు చేయడంలో ఆమెకామే సాటి. మరియ ఆమె కంటె చిన్నది గనుక, మార్త పనులన్ని చేసేస్తుంది గనుక ఆమెకు పనులలో అంత నేర్పరితనం లేదు. లాజరు వారి ముద్దుల తమ్ముడు. అక్కలు చెప్పిన పని చేయడమే అతనికి తెలిసింది.

"బేతనియ" యెరూషలేము దగ్గరగా యెరికోకు పోయే మార్గంలో ఉంది. యేసుప్రభువు ఆ మార్గాన తరచుగా వెళ్తుండేవాడు. ఆయన బోధలు వీరు ముగ్గురూ తరచుగా వినడానికి అవకాశం దొరికింది. ఆయన ప్రేమగల వాక్కులు వీరిని చాలా ఆకర్షించాయి. అందుకే ముగ్గురూ ప్రభువును బాగా ప్రేమించారు. ప్రభువు బేతనియకు ఎప్పుడు వచ్చినా వీరి ఇంటికి తప్పక వచ్చి వెళ్ళే అలవాటు. ఎందుకంటే మార్త తప్పక ఆయనను తమ ఇంటికి భోజనానికి ఆహ్వానించేది. ఇక ఆయన ఇంటికి వచ్చినపుడు ఎన్నెన్ని వంటకాలు విసుగు లేకుండ ఆయనకు చేసిపెట్టేదో. ఒక్కొక్కసారి మరీ విస్తారమైన పని పెట్టుకొని సతమతమయ్యేది. ఒకసారి ఇలాగే ప్రభువును భోజనానికి పిలిచింది. ఆ వేళ ఆయన మీద ఉండే ఆరాధన భావంతో ఏమేమో చేసి పెట్టాలనే ఆరాటంతో విస్తారమైన పని పెట్టుకొని చాలా పనుల వలన కంగారు పడిపోతూఉంది. అటు చూస్తే తన చెల్లి మరియ ఆయన దగ్గర కూర్చొని ఆయన మాటలు వింటూ ఉంది. మార్తకు కాస్త కోపం ఎక్కువేనేమో మరియ అలా నెమ్మదిగా కూర్చొని ఉండడం చూస్తే కోపం ఇంకా ఎక్కువైంది. అప్పుడు మరియతో ఆమె ఏమీ అనలేదు కాని సరాసరి ప్రభువు దగ్గరికొచ్చి "ప్రభువా! నేను ఒంటరిగా పనిచేస్తూ ఉంటే మరియ నన్ను వదిలిపెట్టి ఉండడం నీకు బాధగా లేదా? కాస్త నాకు సహాయం చేయమని చెప్పు (లూకా 10:40) అని ప్రభువుకే చెప్పింది. వెంటనే ప్రభువు ఆమెకు ఏం చెప్పాడంటే "మార్తా, మార్తా నీవు చాలా పనులు పెట్టుకొని ఆలోచిస్తూ తొందరపడి పోతున్నావు. కాని అవసరమైంది ఒక్కటే, అదే ఉత్తమమైన మార్గం, మరియ ఏర్పరచుకుంది. అది ఆమె దగ్గర నుండి తీయడానికి వీల్లేదు" అని చెప్పాడు. మార్తకు కొంచెం తొందరపాటేగాని ప్రభువు మాటల యందు విశ్వాసమూ, నమ్మకమూ ఎక్కువే. అందుకే అవసరమైన ఉత్తమ మార్గం. ఆయన పాద సన్నిధే అని బాగా అర్థం చేసుకొని మరింకేమీ మాట్లాడకుండానే ఊరుకుంది. మార్త, విస్తారమైన పని పెట్టుకున్నది ప్రభువు కొరకే. అనేకమైన పనులను గూర్చి తొందరపడడం ప్రభువు కొరకే. మన పనుల భారం అంతా ప్రభువు సన్నిధిలో పెడ్తే అది ఎంత ఉత్తమమైన మార్గమో ప్రభువు చక్కగా చెప్పాక అర్థం చేసుకోగలిగిందేమో!

**నీ పనుల భారము యెహోవా మీద నుంచుము. అప్పుడు నీ ఉద్దేశ్యములు సఫలమగును (సామె 15:3)**

ఒకసారి వాళ్ళతమ్ముడు లాజరు బాగా జబ్బు పడ్డాడు. ఎన్ని ప్రయత్నాలకీ అది తగ్గుముఖం పట్టలేదు. అక్కచెల్లెళ్ళిద్దరూ బాగా కంగారు పడ్డారు. వెంటనే ప్రభువుకు కబురు చేశారు. ఇదిగో నీవు ప్రేమించిన లాజరు జబ్బు పడ్డాడని. కాని ప్రభువు వెంటనే రాలేదు. పైగా 'ఈ వ్యాధి

మరణం కొరకు రాలేదు గాని దేవుని కుమారుడు మహిమ పరచబడ్డానికే వచ్చిందంటూ" మరో రెండు రోజులు అక్కడే ఉండిపోయాడు. ఆ తరువాత బేతనియ గ్రామానికి ఆయన వచ్చేటప్పటికి లాజరు చనిపోయి సమాధి చేయబడి నాలుగు రోజులయిపోయింది. ప్రభువు గ్రామంలో ప్రవేశింపగానే ప్రభువు కొరకు ఆత్రుతతో కనిపెడుతున్న మార్తకు ఎలా తెలిసిందో గాని పరుగెత్తుకొని తానే ఆయన దగ్గరకు వెళ్ళింది. "ప్రభువా, నీ విక్కడ ఉంటే నా తమ్ముడు చనిపోక పోయేవాడు. ఇప్పుడైనా నీవు దేవుడ్ని ఏమడిగినా ఇస్తాడని నాకు తెలుసు అంది. అప్పుడు యేసుప్రభువు నీ సహోదరుడు మళ్ళీ లేస్తాడు అని చెప్పాడు. అంత్య దినమున పురుత్థాన దినమున లేస్తాడని తెలుసు అని చెప్పింది మార్త. మార్తకు ప్రభువు యెడల విశ్వాసం ఉంది. కాని ఒక అద్భుత కార్యం అప్పుడే అక్కడే జరుగుతుందని గ్రహించలేక పోయింది. అందుకే యేసు చెప్పాడు.

**"పునరుత్థానమును జీవమును నేనే. నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రతుకును. బ్రతికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్నటికి చనిపోడు. ఈ మాట నమ్ముచున్నావా" అని ఆమెను అడిగెను (యోహాను 11:25,26)**

కొన్ని వేల సంవత్సరాల క్రితం పునరుత్థానమును జీవమును నేనే అనే ఈ గొప్ప మాట మొదటిగా యేసు చెప్పింది మార్తతోనే. ఈ గొప్ప మాటతోనే క్రైస్తవ లోకమంతా ఎంతో ఆదరింపబడుతూ ఉంది. ఈ గొప్ప సత్యం క్రైస్తవ్యానికే ప్రత్యేకం. గొప్ప బలం. ఆయన యందు విశ్వాసముంచువాడు ఎన్నటికీ చనిపోడు అనే మాట క్రీస్తును నమ్మిన వారికి ఎంతో ధైర్యాన్ని బలాన్ని ఇస్తుంది. ఈ గొప్ప సత్యం మార్త ద్వారానే బయల్పడింది. "ఈమాట నమ్ముచున్నావా?" అని మార్తను ప్రభువు అడుగగానే "అవును, ప్రభువా నీవు ఈ లోకానికి రావలసిన దేవుని కుమారుడైన క్రీస్తువు" అని నమ్ముతున్నానని చెప్పింది (యోహాను 11:27). అతనిని ఎక్కడ ఉంచారని అడిగి సమాధి దగ్గరకు వచ్చాడు. సమాధి మీద ఉన్న రాయి తీసివేయుడని చెప్పగానే మార్త ఆయనతో ప్రభువా! చనిపోయి నాలుగు దినములయింది కదా, ఇప్పటికి వాసన కొడుతుంది అని చెప్పింది. ఇంత చక్కగా క్రీస్తును నమ్మిన ఆమెకు మృత తుల్యమైన సమాధి దగ్గర కొంత విశ్వాసం సడలింది. యేసుప్రభువు మరోసారి మార్తను హెచ్చరించవలసి వచ్చింది. "నీవు నమ్మిన యెడల దేవుని మహిమ చూతువని నేను నీతో చెప్పలేదా?" (యోహాను 11:40) అని ఆమెతో అన్నాడు. సమాధి మీద నుండి ఆ రాయిని తీసివేసిన తరువాత ప్రభువు కన్నులు పైకెత్తి దేవుని కృతజ్ఞతతో స్తుతులు చెల్లించి 'లాజరూ, బయటకు రమ్మని బిగ్గరగా కేక వేయగానే చనిపోయిన లాజరు బ్రతికి లేచి బయటకు వచ్చాడు. మార్త, మరియ చనిపోయిన తమ్ముని బ్రతికించిన ప్రభువు యెడల మరింత యెక్కువగా కృతజ్ఞతతో ఆయనను స్తుతించారు.

అన్నిటికంటే ముఖ్యమైనది శ్రేష్టమైన పని ఆయన పాద సన్నిధిలో ఆయన వాక్కులు వినడమే అని మార్త తెలుసుకుంది. బహుశా అందుకే యేసయ్య పునరుత్థానము, జీవము గురించి అందరికంటే ముందుగా మార్తతో మాట్లాడాడు. మార్త యేసయ్యే క్రీస్తు అని గ్రహించింది. బహుశా ఆయన మహిమను చూశాక మరింత బలపడి ఉండవచ్చు

మార్త తెలుసుకుంది. మరి మన సంగతేంటి? మనం కూడ అన్నిటికంటే శ్రేష్టమైన పనిని గుర్తిద్దాం. ఆయన పాదసన్నిధిలో వాక్య ధ్యానం చేస్తూ సాధ్యమైనంత ఎక్కువ సమయం గడిపి ఆయనను తెలుసుకుందాం

**నిత్యజీవము పొందుటకు ఆయన యందు విశ్వాసంతో ఉండునట్లు ప్రయత్నించుదముగాక!**

**ఇంటర్నెట్‌లో 'పరిశుద్ధత' మాసపత్రిక కొరకు ఈ క్రింది వెబ్‌సైట్ సందర్శించండి**

Read Our Internet Edition @

**www.holinessmagazine.com**



బ్రదర్ కె.సామ్రాట్

# మదర్‌తెరీసా

విద్యారంగంలో మిషనరీలు, ఫాదర్లు చేస్తున్న సేవ అతనికి బాగా తెలుసు. ఆ భవనం అన్నిటికీ అందుబాటులో వుంది. చక్కగా సరిపోతుంది. అందుచేత దాన్ని కొనడం గురించి ఎగ్జిమ్ ఆర్చ్ బిషప్స్‌తో మాట్లాడారు. అటువంటి భవనం పోతే మరలా దొరకటం కష్టమని దాని ఆవశ్యకతను ఆర్చ్ బిషప్‌గారు ఆ భవనాన్ని కొనడానికి లక్ష రూపాయలు వడ్డీ లేని అప్పుగా మంజూరు చేశారు. డాక్టర్ ఇస్లాం పాకిస్తాన్‌కు వలస వెళ్ళి పోతున్నా, తన భవనాన్ని అమ్మి విడిచి వెళ్ళడం ఎలా? అని ఆలోచిస్తున్నాడు. మదర్ తెరీసా చేస్తున్న సేవ గురించి తన మిత్రులనడిగి తెలుసుకున్నాడు. కాని వారు బేరం కుదిరినా లక్షరూపాయలు ఆ భవనం వున్న స్థలం ఖరీదులో సగం కూడా కాదు. ఇస్లాం ఆ భవనం ముందు నిలబడి దానికేసి చూస్తూ చలించిపోయినట్లు కనబడ్డాడు. కొంచెంసేపు ఆగాక తన దగ్గర్లో మౌలాలి మసీదుకు వెళ్ళి ప్రార్థన చేసి వచ్చాడు. ఆయన కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "దేవుడే నాకీ ఇల్లు ఇచ్చాడు. తిరిగి ఆయనకే ధారపోస్తున్నాను" అన్నాడు. లక్ష రూపాయలకు ఆ పెద్ద భవనాన్ని మదర్ తెరీసాకు అమ్మివేసి డాక్టరు ఇస్లాం వెళ్ళిపోయారు. కొంతకాలం గడిచాక మదర్ తెరీసా లక్ష రూపాయల అప్పును తీర్చివేసినారు.

1953 ఫిబ్రవరిలో మిషనరీస్ ఆఫ్ ఛారిటీ సిస్టర్స్ 27 మందితో లోయర్స్ సర్క్యులర్ రోడ్‌కు మారింది. ఇప్పుడు ఆ రోడ్డు పేరును జగదీష్ చంద్రబోస్ రోడ్డుగా మార్చారు. అది మిషనరీస్ ఆఫ్ ఛారిటీస్ కేంద్ర స్థానమైంది. దానికి మదర్ హౌస్ అని పేరు పెట్టారు. నలభై యేళ్ళలో అది యావత్ క్రైస్తవ కూటమిలో మహా వైభవోపేతంగా వెలిగిపోయే మతశాఖ ఆయువుపట్టు అవుతుందని వాళ్ళు ఆనాడు ఏ మాత్రం ఊహించి వుండరు. ఇవాళ్టి కార్పోరేట్ భాషలో చెప్పుకోవాలంటే ఖండఖండాంతరాల సభ్యులతో అదొక అంతర్జాతీయ సంస్థగా ఎదిగి వుండేదని ఊహించి వుండరు. ప్రపంచంలోనే పరమ నిరుపేదలకు తగ్గ విశాల ప్రాంతంగా ఎదుగుతుందని వాళ్ళు ఆనాడు ఊహించి వుండరు. మందలు మందలుగా ఎగ్జిక్యూటీవ్ అధికారులు లేరు, కంప్యూటర్ల సముదాయము లేదు. టెలెక్స్, ఫ్యాక్స్ యంత్రాలు లేవు ఒక్క టెలీఫోన్ తప్ప. ఖర్చులు పెరుగుతాయని మదర్ తెరీసా ఫోన్ పెట్టించుకోడానికి కూడా ఇష్టపడలేదు. కాని సమయం వృధా కాకుండా వుంటుందని అంగీకరించారు. పైనుదహరించినవేమీ లేకుండానే మదర్ తెరీసా భారతదేశంలోని ప్రతి నగరంలో, పట్టణంలో, అనేక దేశాల్లో పునాదులు వేసుకున్నారు. ఆది క్రైస్తవ సంఘం పాదులు చేసుకొనే రోజులు గుర్తుకు రాకమానవు. పెంతెకోస్తు పండుగనాడు యేసు శిష్యులు, విశ్వాసులూ అంతా మేడగదిలో వున్నారు. అకస్మాత్తుగా ఆకాశం నుండి హోరుగాలులవంటి శబ్దం వినిపించింది. ఆ ఇల్లంతా దద్దరిల్లిపోయింది. అగ్నిజ్వాలల్లాగా పరిశుద్ధాత్మ వాళ్ళను ఆవరించింది. దాంతో ఆ శిష్యులంతా మహాశక్తి సంపన్నులై నానా భాషలూ మాట్లాడుతూ, ఏ జంకూ గొంకూ లేకుండా వీధుల్లోకి వెళ్ళి యేసుక్రీస్తును గురించి శుభవార్తను లోకానికి అందించారు. యెరూషలేములో పాదులు చేసుకొన్న నిజమైన ద్రాక్షవల్లి రెమ్మలు గోడ మీదుగా ప్రాకి భూదిగంతాల వరకు వ్యాపించాయి (ఆది.49:22). క్రీస్తు సిలువను తను భుజం మీద వేసుకుని ఒంటరిగా లోకంలో ప్రకాశించిన మదర్ తెరీసా ఆ 'నిజమైన ద్రాక్షవల్లి' కొమ్మల్లో ఒక రెమ్మ. పెంతెకోస్తు అనుభవాన్ని చవిచూసిన ఫలించెడి కొమ్మ (యోహాను 15వ అధ్యాయం).

మదర్ తెరీసా సేవ నలుదిశలా వ్యాపించింది. ఆమె,

ఆమె సేవికలు చేస్తున్న గణనీయమైన సేవకు అప్పుడపుడే తగిన గుర్తింపు రావడం మొదలైంది. ఆమె సేవలు బెంగాల్ ముఖ్యమంత్రి డా॥ బి.సి.రాయ్, భారత ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూలాంటి మహానాయకుల దృష్టిలోకి వచ్చింది. డాక్టర్ బి.సి.రాయ్ మహా నాయకుడు. బెంగాల్ ముఖ్యమంత్రిగా ఎక్కువకాలం పని చేసిన వారిలో అతడు ప్రముఖుడు. రాజకీయాలలో తలమునకలవుతూనే డాక్టర్ రాయ్ ప్రతిరోజూ ఉదయాన్నే ఒక గంటసేపు ఉచితంగా రోగుల్ని పరీక్షిస్తూ తన వృత్తి ధర్మాన్ని నిలబెట్టుకొనేవాడు. మదర్ తెరీసా ఒకటి రెండుసార్లు డాక్టర్ బి.సి.రాయ్ దగ్గరకు వెళ్ళింది. అయితే ఏ మందుకోసమో, సలహా కోసమో వెళ్ళలేదు. కలకత్తా మహానగరంలో వందలకొద్దీ వున్న మురికివాడల్లో జీవించే వాళ్ళ కష్టాలు వివరించడానికి వెళ్ళింది. పంపుల్లో నీళ్ళు సరిగ్గా రావడంలేదనో, కరెంట్ దీపాలు వెలగటం లేదనో, ఆస్పత్రుల్లో పేదవాళ్ళను సరిగా చూడటం లేదనో విన్నవించుకోడానికి వెళ్ళేది. ముందుగా, ఎవరో పాపం చాలా దయగల తల్లి అనుకున్నాడు డాక్టర్ రాయ్. కాని రాను రాను ఆమె ఉద్దేశాలను, పేదల పట్ల ఆమెకున్న జాలి, దయను గమనించాక ఆమె చేస్తున్న సేవను స్వయంగా చూసి అక్కడున్న వాళ్ళు ఆమె గురించి చెప్పిందంతా విని ఆమెను మహాత్మురాలిగా భావించాడు. ఆనాటి నుండీ మదర్ తెరీసాకు అతని దగ్గర ప్రత్యేకమైన స్థానం ఏర్పడింది.

డాక్టర్ బి.సి.రాయ్ తన 80వ జన్మదినాన ఆఫీసుకు వెళ్ళాడు. వార్తాపత్రికల ప్రతినిధులు ఆయనను కొన్ని ప్రశ్నలు అడిగి ఒక ముఖ్యమైన ప్రశ్న 'ఎనభై ఏళ్ళు నిండినా మీరింకా ముఖ్యమంత్రిగా ఉండటం చాలా గొప్ప సంగతి. ఈనాడు మీరు ఎవరిని తలచుకున్నారు?' అని ప్రశ్నించారు. డాక్టర్ రాయ్‌కి మహాత్మాగాంధీతో స్వాతంత్ర్యోద్యమాన్ని నడిపించిన అనుభవం వుంది. జవహర్లాల్ నెహ్రూతో అత్యంత సన్నిహితంగా మెలిగిన చనువూ వుంది. ఆ యిద్దరిలో ఎవరి పేరు చెబుతాడో అని ఎదురుచూస్తున్నారు. 'మెట్లెక్కి ఆఫీసుకు వచ్చేటప్పుడు నేను మదర్ తెరీసాను జ్ఞాపకం చేసుకున్నాను. పేదవాళ్ళ క్షేమంకోరి ఆమె చేస్తున్న సేవ అమోఘం' అని డాక్టర్ రాయ్ జవాబిచ్చాడు. ఉదయాన్నే వార్తాపత్రికల్లో మదర్ తెరీసా పేరు, డాక్టర్ రాయ్ ఆమెను గురించి చెప్పిన మాటలు పెద్ద అక్షరాల్లో వెలిశాయి.

దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను. దేవుని స్వరూపమందు సృజించెను. స్త్రీనిగాను, పురుషునిగాను వారిని సృజించెను (ఆదికాండం 1:28). దేవుని స్వరూపమందు జన్మించిన మానవులు ఎందరో అభాగ్యులుగా దిక్కులేని చావుకు గురవుతూ కలకత్తా వీధుల్లో కనిపించడం మదర్ తెరీసాను బాధకు గురిచేసింది. మదర్ తెరీసా కలకత్తాలో సంచరిస్తూ వున్నారు. ఒక యిల్లూ, వాకిలీ లేకుండా వీధుల్లో వున్న వాళ్ళని చూశారు. కొన్ని కుటుంబాలు వృధాగా పడివున్న చెత్తా చెదారంతో ఏదో తలదాచుకునేందుకు నిర్మించుకున్నారు. కొంతమంది పాత గుడ్డలతోను, రెల్లుతోను కప్పులు వేసుకున్నారు. చాలామందికి ఆ అదృష్టమూ లేదు. గుళ్ళ బయట బిక్షమెత్తుకుంటూ, ట్రాఫిక్ కూడళ్ళలో అడుక్కుంటూ బ్రతుకుతున్నారు. రాత్రిపూట రోడ్డుపైనే నిద్రపోయేవారు. సరైన తిండి లేకపోవడంతో రకరకాల జబ్బులకు లోనయ్యేవాళ్ళు. జబ్బు ముదిరిన ఆ దశలో వాళ్ళకి ఏమీ చెయ్యలేని పరిస్థితి. దాంతో ఎక్కడ వున్నవాళ్ళు అక్కడే దారిప్రక్కన తనువు చాలించేవాళ్ళు. మున్సిపాలిటీ వాళ్ళకు కబురు తెలిస్తే శవాన్ని తీసుకుపోయేవాళ్ళు. పేరు, వయస్సు, మతం ఏమీ తెలియదు. చనిపోయినట్లు ఒక రిజిష్టరులో రాసేవారు.

ఒకరోజు మదర్ తెరీసా, తోడుగా వున్న సిస్టర్ కాంప్‌బెల్ హాస్పిటల్ దగ్గర ఒక నడివయస్కురాలు స్పృహ లేకుండా పడివుండటం చూశారు. ఆమె ముఖంపై చీమలు పట్టి, ఎముకలు కొరుక్కు తిన్నట్లుంది. ఆమెను ఎత్తుకుని హాస్పిటల్‌కి తీసుకెళ్ళారు. హస్పిటల్ వారు చేర్చుకోలేదు. పడకలు ఖాళీ లేవు, చెయ్యగలిందేమీ లేదన్నారు. మదర్ తెరీసా ఒత్తిడికి తలొగ్గి ఆమెను చేర్చుకున్నారు. తర్వాత కొన్ని గంటలకే ఆమె చనిపోయింది. చనిపోయే వాళ్ళకు ఒక హోమ్ స్థాపించాలని మదర్ తెరీసాకు తోచింది. తనే వాళ్ళ సంరక్షణ చూడాలని నిశ్చయించుకుంది. మోబీజిల్‌లో స్కూలు కొరకు రెండు గదులు అద్దెకు తీసుకున్నారు. దానిలో ఒక గది అవసాన దశలో వున్నవాళ్ళకు హోమ్‌గా మార్చింది. **(సశేషం)**

సైన్స్

# సృష్టికర్త

ప్రస్తుతకాలంలో అందర్ని ఇబ్బంది పెడుతున్న సర్వసాధారణమైన సమస్య ఎండ తీవ్రత. మే నెల అంత విపరీతమైన ఎండతో అందరు ఇబ్బంది పడ్డారు. అంత వేడిమిని సృష్టిస్తున్న సూర్యుని గురించి కొన్ని ఆసక్తికరమైన అంశాలను తెలుసుకుందాం.

మన అందరం ఉంటున్న ఈ విశ్వం గురించి ఎంతో మంది శాస్త్రవేత్తలు ఎన్నో పరిశోధనలు చేసి తెలిపిన విషయాలు ఏమనగా

1. సూర్యుని వయస్సు 460కోట్ల సం॥లు
2. మొత్తం సౌర కుటుంబం బరువులో సూర్యుని బరువు 99.86%.
3. సూర్యుని బరువు 20 లక్షల ట్రిలియన్ ట్రిలియన్ టన్నులు అంటే 20,000000000000000000000000 టన్నులు.
4. విస్తీర్ణంలో సూర్యుడు ఎంత పెద్ద గ్రహమంటే, ఒక్క సూర్యునిలో 10లక్షల భూగ్రహాలను సర్దేయొచ్చట.
5. సూర్యునికి భూమికి గల దూరం 15కోట్ల కి.మీ.
6. 15 కోట్ల కి.మీ దూరాన్ని చేరాలి అంటే 97కి.మీ/అవర్ వేగంతో వెళ్ళే వాహనంలోనే 170 సం॥లు పడుతుంది.
7. సూర్యుని ఉపరితలంపై ఉష్ణోగ్రత 5500 డిగ్రీల సెల్సియస్.
8. సూర్యుని మధ్యభాగంలో ఉష్ణోగ్రత 1,36,00,000 డిగ్రీల సెల్సియస్.
9. ఒక సెకనులో సూర్యునిలో విడుదలయ్యే శక్తి ఈ ప్రపంచం మొత్తానికి 1000 సం॥లకు సరిపోతుంది.
10. సూర్యుడు విడుదల చేసే శక్తిలో కేవలం 1/10,000 వంతు మాత్రమే భూమిని చేరుతుంది.

సూర్యుని మధ్యభాగంలోని వేడి సూర్యుని పైభాగానికి చేరడానికి దాదాపు 10 లక్షల సం॥ల సమయం పడుతుందట. సూర్యుని వేడంతా భూమి మీదకి వస్తే భూమి మీద ఉన్న మంచు మొత్తం కేవలం 3 ని॥లలో కరిగిపోతుంది. ఒకవేళ సూర్యుడు లేకుంటే లేదా అకస్మాత్తుగా మాయమైపోతే అతి కొద్ది రోజులలోనే భూమి మీద ఉష్ణోగ్రతలు −240 డిగ్రీల సెల్సియస్‌కి పడిపోతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భూమిని భూమి మీద వాతవరణాన్ని, జీవరాశుల్ని ఇంతగా ప్రభావితం చేయగల సూర్యున్ని సృజించి, దానికొక కట్టడను నియమించిన దేవున్ని, ఆయన మన కొరకు చేసిన అద్భుతమైన సృష్టి కొరకు అనునిత్యం ఆయనను స్తుతించాలి. పౌలు భక్తుడు చెప్పినట్లు దేవుని నిత్యశక్తి, ఆయన గుణగణాలు అన్నీ ఆయన చేసిన సృష్టిని గూర్చి ఆలోచించడం వలన తెలుస్తుంది.

***ఆయన అదృశ్యలక్షణములు అనగా ఆయన నిత్యశక్తియు దేవత్వమును. జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుట వలన తేటపడుచున్నవి. రోమా 1:20.***

తల్లిదండ్రులు తమ పిల్లలకు కావలసినవన్నీ తమ పరిధిలో ఉన్నవన్నీ సమకూరుస్తారు కదా! పరమ తండ్రియైన దేవుడు కూడ మానవుల మనుగడకు ఏమి అవసరం, ఏ ఏ పరిమాణాలలో అవసరమో అన్నీ ముందుగా సృష్టించి ఆ తరువాతనే మనుషుల్ని సృజించాడు. దేవుడు మానవుల పట్ల ఒక ప్రత్యేకమైన శ్రద్ధ కలిగి ఉన్నాడు. దేవుడు మన పట్ల చూపిస్తున్న శ్రద్ధకు ప్రేమకు కృతజ్ఞతగా మనమేమి ఇవ్వగలం? ఏమి ఇచ్చినా ఆయన ప్రేమతో అది సరితూగుతుందా? సరిపోల్చలేని ఆ ప్రేమను నిత్యము స్తుతించడం ద్వారా అనునిత్యం ఆయనను జ్ఞాపకం చేసుకుంటూ జీవితాన్ని కొనసాగిస్తూ ఆయనకు కృతజ్ఞత చూపుదాం.

సాక్ష్యము

# గొప్ప దేవుడు

నా పేరు రమాదేవి. నేను హిందూ కుటుంబంలో పుట్టాను. మాది విగ్రహారాధన కుటుంబం. నా తల్లిదండ్రులు చనిపోయారు. నాకు ఇద్దరు అక్కలు. నేను నా కుటుంబంలో మూడవ దానిని ఆఖరు దానిని. నా 18వ ఏట మా కులం కాని వేరే కులస్తున్ని ప్రేమించి పెండ్లి చేసుకున్నాను. కొంత కాలం వేరుగా రహస్యంగా నా కుటుంబానికి దూరంగా కాపురం పెట్టుకొని జీవిస్తున్నాం. తర్వాత మా అత్తగారి అనుమతితో అత్తగారింట్లోకి కాపురానికి వెళ్ళాను. నేను గర్భవతిని అయ్యాను. కొంతకాలమైన తర్వాత నా భర్త నన్ను మోసం చేసి ఒక ముస్లిమ్ స్త్రీని (ఆమెకు వివాహం అయ్యి ఒక కొడుకు) ప్రేమించి పెళ్ళి చేసుకొని నా దగ్గరకు తీసుకొని వచ్చాడు. కుటుంబ గొడవల వలన మా ఇద్దరిని వేరే వేరే కాపురాలు పెట్టాడు. ఆమెనే ఎక్కువగా ప్రేమిస్తూ, గౌరవిస్తూ నన్ను నిర్లక్ష్యం చేస్తూ వచ్చాడు. మళ్ళీ గర్భవతిని అయ్యాను. ఆడపిల్ల పుట్టింది. నాకిప్పుడు ఇద్దరు ఆడపిల్లలు. నన్ను నా పిల్లలను నిర్లక్ష్యం చేస్తూ కనీసం భోజన సదుపాయాలు కూడ జరిపేవారు కాదు. ఈ పరిస్థితులలో నా ఆరోగ్యం సరిలేకుండా పోయింది. "ఫిట్స్" లాగా అనారోగ్యం వచ్చింది. కొంత కాలానికి నా భర్త బేల్దార్ పనికి దుబాయ్ వెళ్ళాడు. నాకు దయ్యం ఉందని మా అత్తగారు మంత్రాలు తాయత్తులు కట్టిస్తూ ఏమేమో చేస్తూ ఉంది. నన్ను ప్రేమగా చూసేది కాదు. ముస్లిమ్ అమ్మాయిని ప్రేమగా చూసేది. నేను పిల్లల్ని పెట్టుకొని ఎప్పుడు ఏడుస్తూనే ఉండే దానిని. మా పెద్ద అక్క నన్ను పరామర్శిస్తూ నాకు సహాయం చేస్తుండేది.

ఒకరోజు ఒక మంత్రగాడు వచ్చి నాకు నిమ్మకాయలతో ఏదో మంత్రమేసి వెళ్ళి పోయాడు. తెల్లవారి మా అత్త నన్ను ఆ నిమ్మకాయలను ఒక హిందూ ఆలయం దగ్గరకు వెళ్ళి అక్కడ ఆ దేవత దగ్గర పెట్టి రమ్మని నన్ను ఒక్క దాన్నే పంపింది. అసలే ఫిట్స్ జబ్బుతో, దయ్యం పట్టి ఉన్నాను. దేవస్థానం దగ్గరకి వెళ్ళగానే నాలో దయ్య వచ్చేసి ఫిట్స్ వచ్చి పడిపోయాను. నా చేతిలో 2సం॥ల నా చిన్నకూతురు ఉంది. అయితే నాకేమి తెలియని స్థితిలో నా చేతిలో ఉన్న నా చిన్న కూతుర్ని బాగా కొట్టి నేనున్న స్థలంలో వదిలేసి వెళ్ళిపోయానంట. ఆ మంత్రగాడు తీసుకెళ్ళి పోయాడంట. ఇంక అతనితోనే నేను కాపురం సాగించాను. ఒక్కొక్కసారి బాగానే ఉండే దానను. ఒక్కొక్కసారి దయ్యం చేష్టలు చేసేదాననంట. అతను కూడ అంతగా మైండ్ సరిలేని వాడు. అతను ఒకసారి నన్ను ఒక చర్చికి తీసుకెళ్ళాడంట. అక్కడ పాస్టర్ గారు వాళ్ళు మళయాలీలు. అమ్మగారికి కొద్దిగ తెలుగు వచ్చు. నా సమస్యలన్ని ఆమె గ్రహించి నన్ను చాలా ప్రేమగా చూచేది. నా కొరకు ప్రార్థించేవారు. అయినా నాకు స్వస్థత కలుగలేదు. నేను మంచి స్థితిలో ఉన్నప్పుడు మా పెద్దక్క ఫోన్ నంబర్ తీసుకొని అక్కకు ఫోన్ చేసి పిలిపించి నన్ను బెంగుళూర్ పంపించారు. మా అక్క బెంగుళూర్‌లో ఉండేది. ఆమె ఉండే రవీంద్రనాథ్‌గుట్ట అనే స్థలానికి నన్ను పంపించారు. మా అక్క కూడ చాలా పేదరాలే. ఆమె కార్పోరేషన్‌లో పని చేసుకుంటూ కొద్దిపాటి జీతంతో ఒక్కతే ఉంటూ ఉండేది. మా అక్క నన్ను తన ఇంటికి తీసుకెళ్ళింది.

అక్కడే మా బంధువురాలు ఒక ఆమె పేరు లూదియా. ఆమె ఆ గుట్ట మీద హన్నాకృప సంఘంలో విజయచంద్ర పాస్టర్‌గారి ద్వారా యేసయ్యను తెలుసుకొని విశ్వసించి తన కుటుంబం అంతా ఆ సంఘానికి వెళ్తూ దేవునిలో జీవిస్తున్నారు. ఆ సమయంలో ఆమె ఒక శనివారం నన్ను ఉపవాస ప్రార్థనకు తీసుకెళ్ళింది. అక్కడ పాటలు ప్రారంభించగానే నాలో దయ్యం బయటకు వచ్చి చాలా తొందర చేసింది. అయినా మా అక్క, మా బంధువురాలు లూదియ నన్ను ప్రతి ప్రార్థనకు తీసుకెళ్ళేవారు. ఆ సంఘంలో ఉ॥5గం॥లకు ఉ॥11గం॥లకు సా॥5గం॥లకు

ప్రత్యేకంగా ప్రార్థించే స్త్రీలు కొంతమంది ఉన్నారు. అది ప్రార్థించే సంఘమని పేరు. ఆ సంఘంలో ప్రతి సమస్య, ప్రతి అవసరత కోసం, పిల్లల కొరకు(ప్రత్యేకంగా కొడుకు కావాలంటే కొడుకు, కూతురు కావాలంటే కూతురు) వివాహాల కొరకు మరి ముఖ్యంగా నూతన ఆత్మల రక్షణ కొరకు ప్రార్థన చేస్తారు. ప్రతి ప్రార్థనకు జవాబులు పొందుకుంటారు. అలాంటి సమయంలో నేను అక్కడ ప్రార్థనలో ఉంటూ ఉన్నాను. నాన్నగారు చనిపోయారు. అమ్మ (మంజుల, వాళ్ళ కుమారుడు కృపాస్వరూప్ ఆ సేవ కొనసాగిస్తున్నాడు) గారు నన్ను ఇంట్లోనే పెట్టుకున్నారు. ఎప్పుడు దుష్టుడు నన్ను బలహీన పరిస్తే అప్పుడు ప్రార్థన అది అర్ధరాత్రి గాని అపరాత్రి గాని. ఆ విధంగా సంఘం, అమ్మ, అన్నయ్య నా కొరకు చాలా ప్రార్థించారు. నెల రోజులు దయ్యంతో సహా నేను వారింట్లోనే ఉన్నాను. (దయ్యం నేను కలిసి అన్నం తినే వాళ్ళమంట, దయ్యం నీళ్ళు తాగేదంట, దయ్యంతోనే నిద్రపోయేదాన్నంట, తర్వాత అమ్మ , సంఘం అందరూ నాతో చెప్పేవారు)

ఇలా వారి ప్రార్థన ద్వారా, ప్రభువు కృప ద్వారా, నాకు సంపూర్ణ స్వస్థత కలిగింది. నేను బాగా ప్రార్థన నేర్చుకున్నాను. నాకు చదవడం రాదు. ఇంకా నాకు పిల్లల ధ్యాస, ఆసక్తి, దిగులు బాగా పెరిగిపోయింది. నేను స్వస్థత పొంది మూడు, నాలుగు నెలలు అయ్యింది. ప్రార్థన బాగా నేర్చుకున్నాను. విశ్వాసంలో బాగా ఎదిగాను. నా కొరకు అమ్మ, సంఘం ప్రార్థన చేస్తూ నన్ను విశ్వాసంలో బల పరిచారు. పిల్లలు కావాలి అని అమ్మ దగ్గర ఏడ్చే దాన్ని. ప్రార్థన చేద్దాము నీకు స్వస్థత ఇచ్చిన యేసయ్య నీకు బిడ్డల్ని కూడ ఇస్తాడు అని ధైర్యం చెప్పి, సంఘం అంతా ప్రార్థించడం ప్రారంభించాము. కొద్ది రోజులకే ప్రభువు అద్భుతం జరిగించారు. నా పిల్లలిద్దరూ నా వద్దకు వచ్చారు. నేను నమ్మిన యేసయ్య గొప్ప దేవుడు. ఆశ్చర్యకరుడు, మాట తప్పని దేవుడు. నేను పరిపూర్ణంగా యేసయ్య మీద ఆధారపడి పూర్తి నమ్మికతో జీవిస్తున్నాను. ప్రతి ప్రార్థనకు నమ్మకంగా వెళ్తున్నాను. నా పిల్లలను చదివించుకుంచున్నాను. అమ్మ నన్ను, పిల్లల్ని చాలా ప్రేమతో చూస్తారు. నా కొరకు నా పిల్లల కొరకు ప్రార్థించండి.

**-: గమనిక :-**

**మీరు ఒక గొప్ప సాక్ష్యము కలిగి ఉండ వచ్చు. మీ సాక్ష్యము ద్వారా కొంతమంది మారవచ్చును లేదా విశ్వాసములో బలపడవచ్చు. అటువంటి గొప్ప సాక్ష్యములు మాకు పంపించండి. మేము వాటిని ప్రచురిస్తాము.**


## ఇంటర్నెట్‌లో తెలుగు బైబిల్

**మీరు ఎక్కడున్నా సరే, మీ స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లలో తెలుగు బైబిల్ చూడవచ్చును. అంతేకాక తెలుగు-ఇంగ్లీషు ప్యారలల్ బైబిల్, తెలుగు ఆడియో బైబిల్, తెలుగు బైబిల్ ఎన్‌సైక్లోపీడియా, తెలుగు ఆడియో, వీడియో పాటలు, తెలుగు పాటల రచనలు, అద్భుత సాక్ష్యములు, తెలుగు క్రైస్తవ సినిమాలు, బైబిల్ వాల్‌పేపర్స్, తెలుగు క్రైస్తవ పుస్తకములు, క్రైస్తవ వివాహ వేదిక, మీ ప్రార్థన అవసరతల కొరకు ప్రార్థనా గది... ఇంకా మరెన్నో మీ కోసం... నేడే దర్శించండి...**

**www.onlinetelugubible.net/www.onlinetelugubible.in**

**www.onlinetelugubible.net**

# దేవుడు - సిరి

దేవుడు మన స్వరూపమందు మన పోలిక చొప్పున నరులను చేయుదము అనుకొనినప్పుడు దేవుడు ఒక్కడు కాక త్రిత్వమైయున్నాడని తెలుస్తుంది. దేవుడు నిర్మించిన నరుడు కూడా ఒంటరిగా జీవించలేనట్లుగా నిర్మించబడ్డారు. మానవ మనుగడ ఒంటరిగా సాగలేదు. కనుక మానవులలో ఎవరికి ఏమి ఇచ్చినా, అనుగ్రహించినా, అది సమిష్టిగా పంచిపెట్టటానికి ఇవ్వబడుతుంది కాని, తీసుకొనిన వ్యక్తి దాచిపెట్టుకోవటానికి కాదు. దాచిపెట్టిన వారిని, పనికిమాలిన ఆ దాసుని, చీకటి లోనికి (భవిష్యత్తు అంధకారము చేయబడిన జీవితం) త్రోసివేయబడును.

అసలు మానవుడు ఎందుకు దాచిపెడుతున్నాడు. ఇతరులకు పంచి పెట్టుటకు ఆయన ఐదు రొట్టెలు, రెండు చిన్న చేపలను పట్టుకొని ఆకాశమువైపు కన్నులెత్తి ఆశీర్వదించి, ఆ రొట్టెలు విరచి వారికి వడ్డించుటకు తన శిష్యుల చేతికిచ్చాడు. లూకాలో అయితే జనసమూహమునకు వడ్డించుటకై శిష్యుల కిచ్చెను. జనసమూహములకు వడ్డించుటకు (ఇచ్చుటకు) అనగా ఒక మనిషి ద్వారా మరొక మనిషికి దేవుడు తన ఆశీర్వాదాలను అందజేస్తున్నాడు.

కొండమీద ప్రసంగంలో యేసు "భూమి మీద మీ కొరకు ధనమును కూర్చుకొనవద్దు" అన్నాడు. కూర్చుకొంటే ఆ ధనమును చిమ్మెట తినివేస్తుంది. చిమ్మెట కాని, తుప్పుకాని, దొంగకాని దాచిన ధనమును రహస్యంగా తీసుకొనేటప్పుడు ధనమును దాచిన వానికి హాని కలిగించకుండా తీసుకోలేదు. అసలు ధనమును ఎందుకు దాచిపెడుతున్నారు? గొప్పతనము కోసం, కన్నులారా చూచుకోవటానికి మాత్రమే కాదు, అది ఒక విగ్రహారాధన. ఎలాగంటే కనపడని దేవునికి ఓ రూపము ఏర్పాటు చేసి, తద్వారా మనసులో దేవుడ్ని నిలుపుకోవటం తేలిక అని మనిషి భావించినట్లుగా కాక రాబోయే దినాల్లో గొప్ప అపాయము, గొప్ప రోగము వస్తే, డబ్బు అవసరం. ఎవరు తీరుస్తారు? ఫలించి అభివృద్ధి చెంది విస్తరించి, భూమిని నింపమనిన దేవుని ఆశీర్వాదాన్ని మనిషి కుటుంబ నియంత్రణ పేరుతో వ్యతిరేకిస్తున్నాడు. భవిష్యత్తును గూర్చిన భయంతో మానవులు ఈ రోజుల్లో బిడ్డలను చాకలేము అనుకుంటున్నారు. మనల్ని పోషిస్తున్న దేవుడు మన కాళ్ళ క్రిందనున్న మట్టిలోనుండి మనకు ఆహారం పుట్టిస్తున్నాడని ఎరుగుట లేదు. నీతిమంతుడు విశ్వాసము వలన జీవిస్తున్నాడు. విశ్వాస మూలము కానిది ఏదో అది పాపము. ఎంత సంపద ఉన్నా, బంధు బలగమున్నా, దేవునితో సహవాసం చెయ్యకుంటే, దేవునితో నడువకుంటే ఆ జీవితం దుఃఖమయం. ఆయన మాటలను ధ్యానించాలి. ఆయన చెప్పే ప్రతిమాట మన మంచి కొరకేనని మనం నమ్మాలి. బైబిల్‌లోని ప్రతి అక్షరము ఆచరించదగినది. మనకు దేవుడిచ్చినది ఏదైనా మనం ఇతరులతో పంచు కొనినప్పుడే మనం దీవించబడి, ఈ భూమి మీద సంతోష సమాధానాలతో జీవిస్తాము.

మన రేపటి అవసరాల కొరకు కూడ ఆలోచించవలసినదే! అందు కొరకు కూర్చుకొనవలసినదే! ఆ దాచిపెట్టటం కూడా జ్ఞానవంతమైనదిగా ఉండాలి. అజ్ఞానంగా దాచిపెట్టినది అనేకసార్లు హృదయవేదనకు గురి చేస్తుంది. అప్పు తీర్చలేని వ్యక్తులకు అప్పు ఇవ్వటం, వడ్డీకి ఆశపడి ప్రైవేటు బ్యాంకుల్లో దాయటం కాక, సురక్షితంగా డబ్బు దాచుకోవాలంటే నమ్మకమైన చోటు దేవుని దగ్గర దాచుకోవటమే. డిపాజిట్ చేయవలసిన విధానాలన్నీ పరిశుద్ధ గ్రంథములో సూచింపబడినవి.

డబ్బు దాచుకోవటానికి కంపెనీ వారి నిబంధనలు మనం తెలుసు కున్నట్లుగా బైబిల్‌లోని నిబంధనలు తెలుసుకోవాలని మన హృదయంలో ఆశించితే దేవుడే ముందడుగు వేసి మన యొద్దకు ఆయన ఏజంట్లని పంపిస్తాడు. మన డబ్బుకు దేవుడు జత చేసి ఇచ్చే వడ్డీ చాలా గొప్పది. దీవెనకరమైనది.

చిన్నపిల్లల పేజి

# బైబిలు కథలు - సొలొమోను

పిల్లలూ!ఎలా ఉన్నారు? వేసవి సెలవలను హాయిగా ఎంజాయ్ చేశారా! స్కూల్స్ తిరిగి ప్రారంభించబడ్డాయి కదా! బుద్ధిగా చదువుతూ అమ్మకు లోబడండి. చదువుతో పాటు కొంత సమాయాన్ని, ప్రార్థించుటకు, బైబిల్ చదువుటకు వెచ్చించడం మర్చిపోకండి.. దేవుని జ్ఞానాన్ని తెలుసుకోండి. మరి ఈ రోజు కథలోకి వెళ్దామా.

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన జ్ఞాని సొలొమోను. ఇతను దావీదు కుమారుడు. దావీదుకి చాలా మంది కుమారులున్నప్పటికి దేవుడు సొలొమోనును దావీదు తరువాత రాజుగా ఎన్నుకున్నాడు. సొలొమోను తల్లి పేరు బత్షెబ. సొలొమోనును రాజుగా పట్టాభిషేకం చేసిన తరువాత సొలొమోను తన తండ్రియైన దావీదు చెప్పిన ప్రకారం యెహోవాకు మందిరము కట్టించాడు. బంగారముతో దేవుని మందిరాన్ని కట్టించాడు. ఒక రోజు రాత్రివేళ దేవుడు సొలొమోను దర్శనములో కనిపించి నీకేం కావాలో కోరుకోమన్నాడు. అప్పుడు సొలొమోను దేవునితో నీ దాసుడైన దావీదు తరువాత ఆ సింహాసనం నాకిచ్చావు కానీ నేనింకా చిన్నవాడిని కాబట్టి మంచి చెడ్డలు విచారించి ఈ నీ ప్రజలకు న్యాయం తీర్చుటకు వివేకము గల హృదయం దయచేయమని అడిగాడు. దేవుడు అతని మనవిని ఆలకించి బుద్ధి, జ్ఞానములను, వివేకము గల హృదయమును దయచేశాడు. అతడు అడగకపోయిన దేవుడు సొలొమోనుకు ఐశ్వర్యమును ఘనతను కూడ ఇస్తాను, నువ్వు కూడ నీ తండ్రియైన దావీదు నడిచినట్లు యదార్థంగా నడుచుకుంటూ దేవుని ధర్మశాస్త్రమును అనుసరించమని చెప్తాడు. సొలొమోను నిద్ర మేల్కొని అది కల అని తెలుసుకొని యెరూషలేం దేవాలయముకు వచ్చి దేవునికి సమాధాన బలులను దహన బలులను అర్పించాడు. అంతేకాదు దావీదు మహారాజు కట్టించాలి అనుకున్న దేవుని మందిరాన్ని యెరూషలేములో సొలొమోను కట్టించాడు. ఆ మందిరాన్ని కట్టడానికి ఏడు సంవత్సరాలు పట్టింది. సొలొమోను కట్టించిన మందిరం ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. ఆ మందిరం అంతా బంగారంతో చేయబడింది. దేవదారు లెబానోను వంటి మంచి వృక్షాల చెక్కను వాడారు. మందిరపు ఉపకరణాలన్ని బంగారం తో చేయబడినవి. సొలొమోను తనకోసం ఒక నగరాన్ని కట్టించుకున్నాడు. ఆ నగరాన్ని కట్టడానికి 13సం॥లు పట్టింది. సొలొమోను ఫరో కుమార్తెను పెళ్ళి చేసుకున్నాడు.




ఒక రోజు ఇద్దరు స్త్రీలు రాజైన సొలొమోను వద్దకు వచ్చారు వారిలో ఒకామె రాజుతో– "చిత్తగించుము నేను ఇంకొక స్త్రీ ఒకే ఇంటిలో ఉంటున్నాం. నేను ఒక పిల్లాడిని కన్నాను. నేను కనిన మూడవ రోజున ఈమె కూడ ఒక బిడ్డకు జన్మనిచ్చింది. అయితే నిన్నటి రాత్రి ఆమె తన బిడ్డ మీద పడగా ఆ బిడ్డ చనిపోయింది. అయితే ఆమె చనిపోయిన తన బిడ్డను నా కౌగిటిలో పెట్టి, బ్రతికి ఉన్న నా బిడ్డను తన కౌగిట్లో ఉంచుకొని అది తన బిడ్డ అని చెప్తుంది. మీరే న్యాయం చేయాలి" అంది. రెండవ స్త్రీ కూడ

అదే విధంగా చెప్పి బ్రతికి ఉన్నదే తన బిడ్డ, చనిపోయినది మొదటి స్త్రీ బిడ్డ అని చెప్పింది. ఆ ఇంట్లో వారిద్దరు కాక మరెవ్వరు లేకపోవడంతో విచారించి తెలుసుకొనుటకు కూడ అవకాశం లేదు. అప్పుడు సొలొమోను ఒక కత్తి తెప్పించి బ్రతికి ఉన్న ఆ బిడ్డను సమానంగా రెండు భాగాలు చేసి ఇద్దరికి చెరొక భాగము ఇమ్మని చెప్పినప్పుడు ఆ బిడ్డ కన్నతల్లి తట్టుకోలేక రాజుతో ఆ బిడ్డను చంపక వేరొక స్త్రీకి ఇప్పించమనెను. అయితే ఇంకొక స్త్రీ ఆ బిడ్డను రెండు భాగాలు చేయడానికి ఒప్పుకొంది. దాంతో బిడ్డ చావుకు అంగీకరించని స్త్రీయే ఆ బిడ్డకు నిజమైన తల్లి అని సొలొమోను గ్రహించి ఆమెకు బిడ్డను అప్పగించెను. సొలొమోను జ్ఞానమును చూసి జనులందరు ఇది దైవ జ్ఞానమని సొలొమోనుకు భయపడ్డారు. ఒకసారి షేబ దేశపు రాణి సొలొమోను జ్ఞానమును గురించి విని పరీక్షించి తెలుసుకొనుటకు వచ్చి చూసి నేను విన్నది చాలా తక్కువ అని తమ దేశపు విలువైన వస్తువులు రాజు గారికి కానుకగా ఇచ్చి వెళ్ళింది.

ఈ విధంగా సొలొమోను జ్ఞానిగా ప్రపంచ ఖ్యాతి పొందాడు. సొలొమోనుకు నాతాను ప్రవక్త యదీద్యా అని పేరు పెట్టాడు. యదీద్యా అంటే యెహోవాకు ప్రియుడు అని అర్థము. సొలొమోనుకు 700 మంది భార్యలు, 300 మంది ఉపపత్నులు ఉన్నారు. సొలొమోను దేవుని ఆజ్ఞను పాటించక తన భార్యలను బట్టి విగ్రహాలను పూజించాడు. దేవుడు రెండు సార్లు హెచ్చరించినా సొలొమోను హృదయం దేవునివైపు తిరగలేదు. అంతటి జ్ఞాని అయినా కూడ దేవుడు లేకుంటే ఆ జ్ఞానం చెల్లుబాటు కాదు. దేవుడు సొలొమోను నుండి రాజ్యాన్ని తీసివేసి యరోబాముకు ఇచ్చాడు. సొలొమోను ఇశ్రాయేలీయుల్ని 40 సంవత్సరములు పరిపాలించాడు. అతని కాలంలో యుద్ధాలు లేకుండా జనులు నెమ్మదిగా ఉన్నారు. బైబిల్లోని సామెతలు, పరమగీతములు, ప్రసంగి సొలొమోను రాసినవే.

చూశారా, పిల్లలూ! సొలొమోను దేవుని మీద ఆధారపడినంత కాలం అతను దేవున్ని అడిగిన జ్ఞానంతో పాటు, ఐశ్వర్యము, ఘనత కలిగాయి. అయితే ఎప్పుడైతే అతని హృదయం దేవునికి దూరమైందో అప్పుడు దేవుడు ఇచ్చిన జ్ఞానం కూడ అతనిని కాపాడలేకపోయింది. కాబట్టి మనం ఎంతటి తెలివి గల వారమైనప్పటికి ఫస్ట్ ర్యాంక్ స్టూడెంట్స్ అయినా, దేవుని మీద ఆధారపడాలి. ఆయన ఆజ్ఞలను భయభక్తులతో మనఃపూర్వకంగా ఆచరించాలి. అప్పుడు దేవుడు మనయందు సంతోషిస్తాడు.




**హన్నాకృప**

**క్రిస్టియన్ బుక్ సెంటర్**

**రైల్వేస్టేషన్ రోడ్, క్లాపేట, 6వ లైను, ఒంగోలు-523001, ఫోన్: 9440217726**

మా వద్ద అన్నిరకముల బైబిల్స్, సండేస్కూల్ మెటీరియల్, సండేస్కూల్ బైబిల్ గేమ్స్ మొదలగునవి లభించును. మీకు కావలసిన బైబిల్స్, సండేస్కూల్ మెటీరియల్ ఈ క్రింది వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చును

**www.onlinetelugubible.net**

**ఆధునిక ధృక్పథం**

# క్రొత్త కోణాలు

# 4. పదిమంది కన్యకలు

**యేసు చెప్పిన ఉపమానాలన్నింటిలో బహు సుందర కథా శిల్పఖండం. గద్యరూపంలో చెప్పిన పద్యకావ్యం. ఒక చిత్రవర్ణ పటాన్నెన్ని విధాలుగా వర్ణించవచ్చో అన్ని విధాల భాష్యాలు చెప్పవచ్చు. ఈ కథ ఆయా మతాల్లో ఆయా నీతి బోధలు చేయటానికి రకరకాలుగా మార్చబడింది. ఒక పెండ్లి కుమారుడు ఆమోదించగల ప్రవర్తనకు ఒదగగల హృదయం, లోబడగల చిత్తం ఇందు పొందుపరచబడింది. ఇది కేవలం బుద్ధిగల, బుద్ధిలేని కన్యకల తారతమ్యాన్ని చూపే నీతికథగాదు. సర్వ సంసిద్ధంగా వేచి ఉండటంలో గల ఆశీర్వాదాన్ని చిత్రించే ఆధ్యాత్మిక పరమార్థానికి జనరంజకమైన జానపద సంఘటన.**

పదిమంది కన్యకలు ఉపమానం మత్తయి (25) లో మాత్రమే ఉంది. అందలి కీలక బోధ గ్రహించాలంటే యేసుప్రభువు యొక్క రెండు రాకడలను గురించి కొంతైనా తెలియాలి.

స్వంత బుద్ధిపూర్వకంగా తనను ప్రేమించి సహవాసం చేయగల జీవిని కోరి దేవుడు నరుణ్ణి సృష్టించాడు. దేవుడు పరిశుద్ధుడు కనుక ఆయనతో సహవాసానికి నరుడు పరిశుద్ధంగా ఉండాలి. పరిశుద్ధత దేవుని ఆజ్ఞల ప్రకారం జీవించడం ద్వారానే కలుగుతుంది. అయితే, నరుడు ఆజ్ఞాతిక్రమం చేసి దేవుని సహవాసం నుండి వేరయ్యాడు. అలా తప్పిపోయిన నరుణ్ణి తిరిగి తన సహవాసంలోకి తెచ్చుకొనడానికి దేవుడు చేసిన ప్రయత్నాలే పాతనిబంధన చరిత్ర. ఈసారి, మానవుణ్ణి తనతో సమాధానపరచుకొనటానికి తన జనతైక కుమారుడైన యేసుక్రీస్తును నరావతారిగా ఈ లోకానికి పంపాడు.

## యేసు మొదటి రాకడ

యేసు దేవుడైయుండి కూడా, రక్తమాంసాలు కలిగి, ఒక ఊరు, వాడ, ఇల్లువాకిలి, తల్లిదండ్రులుగల చారిత్రాత్మక వ్యక్తిగా ఈ లోకంలో పుట్టాడు. ముప్ఫై సంవత్సరాలు తండ్రి యింటి లోనే వడ్రంగం చేశాడు. ఆ తరువాత మూడున్నర సంవత్సరాలు పాలస్తీనా లోపల వెలుపల నలుమూలల కాలి నడకను తిరిగి దేవుని గురించి బోధించాడు. అనేక శారీరక, మానసిక, ఆత్మీయ వ్యాధుల్ని మాటతో, స్పర్శతో నయంచేశాడు. దుష్టశక్తుల మీద అధికారం ప్రదర్శిస్తూ అద్భుతాలు చేశాడు. తన స్వజాతి యూదా మతోన్మాదుల చేతుల్లో దారుణ సిలువ మరణం పొందాడు, సమాధి చేయబడ్డాడు, మూడవరోజు పునరుత్థానుడై లేచాడు. నలుభైదినాలు ఆత్మ స్వరూపంలో భూలోక సంచారం చేశారు, తన శిష్యులను కలిసి బలపరచాడు, ఆకాశానికి ఆరోహణుడయ్యాడు, తండ్రి కుడిప్రక్క సింహాసనాసీడై మానవుల విషయం విజ్ఞాపన చేస్తూ ఉన్నాడు, తిరిగి వస్తానని శిష్యులకు వాగ్ధానమిచ్చాడు.

## పరలోకరాజ్యం

యేసు పరలోక రాజ్యాన్ని భూలోకంలో స్థాపించాలని వచ్చాడు. పరలోకరాజ్యమంటే మానవుడు దేవునితో సమాధాన సహవాసాలతో ఉండే చోటు. దానిని దేవుని రాజ్యం అని కూడా అన్నారు. ఆ రాజ్యంలో దేవుని పరిపాలన, ఆధిపత్యం ఉంటుంది. దానిని స్థాపించ వచ్చే వానినే మెస్సియాగా యూదులంతా ఎదురు చూచేవారు. యేసుక్రీస్తును యూదులు మెస్సియాగా గుర్తించలేదు– ఈనాటికీ, ఆ రాజ్యం సమీపంలో ఉందని బాప్తిస్మ మిచ్చే యోహాను ప్రకటించాడు (మత్త 3:1). ఈ పొలికేకనే యేసు పరిచర్య ప్రారంభంలో బోధించాడు (మత్త. 4:17). పరలోకరాజ్యం యేసుతో భూలోకానికి వచ్చినట్లేనని చెప్పాడు. ఈ రాజ్య ప్రకటనలో పాపక్షమాపణ ప్రధానమైంది. ఈ పాపక్షమాపణ మోషే ధర్మశాస్త్రంలోని ప్రాయశ్చిత్త బలుల మూలంగా కాదుగాని మారుమనస్సు, బాప్తిస్మముల మూలంగా కలుగుతుందనే కొత్త కోణపు భాష్యం యేసు బోధించాడు. అయితే బలుల మాటేమిటి? ప్రతి పాపి, ప్రతి పాపానికి ఏదో ఒక బలి యియ్యటం కాకుండ అన్ని కాలాలలోని అందరి మానవుల అన్ని పాపాలకోసం ఏ పాపమెరుగని యేసు ఒక్కడు సిలువ మీద చిందించిన తన రక్తం సరిపోతుంది. ఈ క్రొత్తకోణంలో యేసుక్రీస్తు మోషే ధర్మశాస్త్రాన్ని నెరవేర్చాడు. అయితే, మానవులేమి చేయాలి? యేసుక్రీస్తును తమ రక్షకునిగా ప్రభువుగా విశ్వసించాలి, మనసులో విశ్వసించిందాన్ని బహిరంగంగా నోటితో ఒప్పుకోవాలి, దానికి బాహ్యచిహ్నంగా బాప్తిస్మం పొందాలి. వీని వెనుక మారు మనస్సు పొందాలి. మారుమనస్సంటే– యేసు చెప్పిన బోధలకు మార్గానికి వ్యతిరేక దిశలో నడిచే దశనుండి యేసు బోధల దిశకు మారటానికి కృత నిశ్చయుడగుట (మత్త. 7:23)!

ఈ పరలోకరాజ్యం భవిష్యత్తుకు చెందింది కూడ. ఈ రాజ్యం పరిపూర్ణంగా వచ్చేది సిలువద్వారానేనని, తండ్రి చిత్తాన్ని పూర్తిగా నెరవేర్చుట ద్వారానే ఈ రాజ్యం మీద తాను పూర్ణాధికారం పొందనున్నాడని (మత్త. 28:13) దుష్టశక్తుల్ని, (సాతానును) నిత్యనరకాగ్నిలో బంధించినప్పుడే ఈ వర్తమాన లౌకిక వ్యవస్థ పరిసమాప్త మౌతుంద క్రైస్తవ విశ్వాసం.

## పరలోకరాజ్యం - క్రీస్తు సంఘం

క్రీస్తు బోధించిన పరలోకరాజ్యం, ఆయన స్థాపించిన సంఘం లకు అవినాభావ సంబంధమున్నది కాని ఆ రెండూ తాదాత్మ్యాలు కావు. ఈ లోకమంతటిలో, క్రీస్తులో, దేవుని సంపూర్ణ విమోచనా కార్యసిద్ధి దేవుని రాజ్యమైతే, యేసుకు చెంది, ఆయన రక్షణ సువార్తనంగీకరించిన వారి సమూహం సంఘమౌతుంది. రాజు నాజ్ఞల ప్రకారం జీవించు వారి జీవితాల్లో పరలోకరాజ్యం సదృశ్యరూపం దాల్చుతుంది (మత్త. 11:28). అంతమాత్రాన దేవుని రాజ్యం కేవలం క్రైస్తవ సంఘ సరిహద్దులకే పరిమితం కాదు. ప్రకటన గ్రంధంలో వ్రాయబడినట్లు ప్రపంచ చరిత్రనంతటిని దేవుని రాజ్యం తన

**వ్యాసరచనోద్దేశం:**

**దాదాపు క్రీస్తుకు ముందు పదిహేను శతాబ్దాల క్రితం మోషే ధర్మశాస్త్రం యూదుల పరమపద సోపాన చట్టాంగమయింది. అది క్రీస్తు జన్మించే నాటికి పారం పర్యాచారాలతో, వేషధారణతో, యెరూషలేము దేవాలయ కేంద్రిత ఆచారబద్ధ మతంగా ఆనాటి పరిసయ్యుల యాజకులభాష్యాలతో రసాభాస మయింది.**

**అయినా, క్రీస్తు స్వచ్ఛమైన ధర్మశాస్త్రాన్ని కొట్టి వేయటానికి రాలేదన్నాడే కాని అందలి ప్రతి చట్టాన్ని క్రొత్తకోణాల్లో విశదీకరించి మరీ నెరవేర్చాడు. అది క్రైస్తవ్యమయింది.**

**క్రీస్తు విధానం వచ్చి కూడ నేటికి రెండు సహస్రాబ్దా లయ్యాయి. ఆయన చెప్పిన విషయాలు కూడ పోపుల, బిషప్పుల, మతగురువుల, పాదిరీల బాష్యాల్లో మెలికలు పడుతున్నట్లు అనిపిస్తుంది. వానిని సంధర్భోచితంగా గ్రహించటానికి ఈ వ్యాసావళి రచన ఒక ప్రయత్నం.**

ఆశీర్వాదకరమైన విమోచనా జెండాతో దండెత్తి జయించాల్సి ఉంది. ఇది భవిష్యత్తుకు చెందింది. అంతిమ సంఘర్షణ ద్వారానే సదృశ్యయ్యే, సంపూర్ణ విజయం, విజయంతో కూడిన సమాధానం, రక్షణ, సుస్థిరంగా స్థాపించబడుతాయి. ఇది జరగటానికి క్రీస్తు రెండవసారి రావాలి, దానినే రెండవ రాకడ అంటారు.

### రెండవ రాకడ

క్రైస్తవ విశ్వాసానికి, నిరీక్షణకు రెండవ రాకడ పరాకాష్ఠ. ప్రభువు వచ్చుచున్నాడు (1కొరి. 16:23) అనే దానికి ఆదిమ భాషలో 'మరన్ ఆత' అనగా ప్రభువు వచ్చుచున్నాడు, లేక వచ్చియున్నాడు, లేక ప్రభువా రమ్ము అనే త్రికాలార్థాలున్నాయి.

ప్రభువు తిరిగి రానున్నాడని తన శిష్యులకు వాగ్దానం చేశాడు. ఎందుకొచ్చేది చెప్పాడు (1థెస్స. 4:13-18, 1కొరి. 15:25,26, మత్త. 24:31, 25:31-46, కొల. 3:4, మత్త. 16:27మొ॥). ఆయన వచ్చే ముందు జరగాల్సిన విషయాల ఆనవాళ్ళు ఇచ్చాడు (మత్త. 24:14, 1కొరి. 15:51-52, మత్త. 24:37-47మొ॥). ఇంకా యుద్ధాలు, భూకంపాలు మొదలైనవి కూడా సంభవిస్తాయి. ఆ తరువాతే అంతం వస్తుంది.

ఎన్ని చెప్పినా ఆ సంవత్సరం, నెల, దినం, ఘడియ మాత్రం తండ్రికి తప్ప కుమారునికి కూడా తెలుపబడలేదని చెప్పాడు (మత్త. 24:37). ఈ నేపథ్యంలో, ఆయన ఒలీవకొండ మీద కూర్చుండి యున్నప్పుడు శిష్యులాయన యొద్దకు ఏకాంతంగా వచ్చి అడిగినప్పుడు సూచనలతోపాటు ఒక మహా సత్యాన్ని వెలిబుచ్చాడు – 'మీరనుకొనని గడియలో మనుష్యకుమారుడు వచ్చును గనుకయే మీరును సిద్ధముగా ఉండుడి' (మత్త. 24:44).

### పదిమంది కన్యకల ఉపమానం

పైన చెప్పిన సలహాను విశదీకరింటానికి యేసు పదిమంది కన్యకల ఉపమానం చెప్పాడు (మత్త. 25:1-13). ఈ ఉపమానం అర్థంచేసుకొనటంలో కష్టమేమీలేదు. తూర్పుదేశాల్లో (పాలస్తీనా వంటి) పెళ్ళిళ్ళు రాత్రిళ్ళు జరుగుతాయి. పెళ్ళిళ్ళలో ప్రధానాంశాలు ఊరేగింపు, విందుభోజనం. విందుకు పిలిచిన అతిథులంతా వేరే దీపాలు లేని వీధుల్లో దివిటీలు పట్టుకొని ఊరేగుతారు. ఈ అతిథుల్లో పదిమంది కన్యలున్నారు. వీరిలో పుట్టుకతోనే అయిదుగురు బుద్ధిగలవారు, ఐదుగురు బుద్ధిలేని వారు కారు. ఐదుగురు, ఎటుండి ఎటువస్తుందోనని ముందాలోచనతో తమ దివిటీలతోపాడు అదనపు నూనెతో బయలుదేరారు. వారు బుద్ధిమంతుల నిపించుకోటానికి ఈ ముందాలోచనతో కూడిన సిద్ధపాటే. తక్కిన అయిదుగురు బహుశ అతి తెలివిగలవారు. ఎంతనూనె పడుతుందో అంచనావేసి సరిపోతుందనుకొన్నంత వరకే నూనె దివిటీల్లో పోసుకున్నారు. పెళ్ళికుమారుడు రావటం ఆలస్యం అయింది. తూర్పుదేశాల్లో ఆలస్యాలు మామూలే. అయినా, కొందరు అందుకు సిద్ధపడరు. అదే వారి బుద్ధిలేని తనం. పదిమంది కునికి, నిద్రపోయారు. నడిజామున పెళ్ళి కుమారుడు వస్తున్న సందడి విని అందరూ లేచారు. గభగభా మకిలి పట్టిన దివిటీవత్తుల్ని సరిచేసుకున్నారు. వారు కునుకు తీసినప్పుడు కూడా దివిటీలు తగ్గు వత్తితో మండటంవల్ల నూనె అయిపోయింది. అదనంగా నూనె సిద్దెలు తెచ్చుకొన్న ఐదుగురు నూనె పోసుకొని పెండ్లి కుమారుణ్ణి ఎదుర్కొనబోయారు. అదనపు నూనె తీసుకొనిరానివారు నూనె గలవారిని నూనెనిమ్మని అడిగారు. నూనె పంచితే వారికీ వీరికీ సరిపోకపోవచ్చు కనుక నూనె లేనివారిని అంగడికి పోయి కొనుక్కోమని చెప్పారు. పెండ్లి కుమారునితో కలిసి విందు గృహంలో ప్రవేశించారు. బయట తలుపు బిగించబడింది. ఆ తరువాత ఐదుగురు కన్యకలు నూనెకొని, దివిటీలు వెలిగించుకొని పెళ్లి యింటికి వచ్చారు. తలుపులు తీయమని యాచించారు. లోనుండి వారెవరో తెలియనే తెలియదని చెప్పాడు. ఐదుగురు కన్యలకు పెండ్లికుమారునితో విందుభోజనం చేసే అవకాశం పోయింది.

ఈ ఉపమానమెంత రసవత్తరమైనదో అంత దుఃఖాంత మయింది కూడా. ఈ ఉపమానాన్ని ఎవరి సిద్ధాంతాల ప్రకారం వారు విశదీకరిస్తుంటారు. ఉన్నది ఉన్నట్లు చెప్పాలంటే నాలుగు విషయాలు గమనార్హం.

1. ఇక్కడ సిద్దెలు, నూనె, సంసిద్ధత బాహ్య అంశాల్లో కాదు కాని ఆంతరంగిక, ఆత్మీయ శుద్ధి, సిద్ధపాటుకు సూచనలు. ఇక్కడ పదిమందికి పెండ్లికుమారుని కెదురేగాలని ఉంది. పదిమంది అందుకు అవసరమైన సరంజామాతో (వస్త్రాలంకరణ, దివిటీలు మొ॥) బయలుదేరారు. అయితే ఈ పదిమందిలో కొన్ని మౌలిక బేధాలున్నాయి. వారిలో ఐదుగురికి బాహ్య అభిమానముందిగాని ఆంతరంగిక లోతు అనుభవం లేదు. వారిని ఆచారబద్ధ మతావేశం గలవారికి పోల్చవచ్చును.

2. ఒక హఠాత్పరిణామానికి సిద్ధపడి ఉండాలి. అసలు పరిణామమేమయినా మన జీవితాన్ని ప్రభువు నేర్పిన విధంగా జీవిస్తూ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలే కాని ఆయన వచ్చే వేళా విశేషాలను బ్రాకెట్లు ఆడేవాళ్ళు అంచనాలు కట్టినట్లో, తనిఖీ అధికారులు వచ్చే తేదీలకు ముందు హడావిడిగా బూటకపు సిద్ధపాటు పడటమో సరికాదని తెలిపే ఉపమానం.

3. నూనె దేవుని కృపకు పోలిక. రెండవ రాకడలో ఒకరి నూనెను ఇంకొకరికి ఇయ్యలేరు, పొందలేరు. రక్షణ ఎవరిది వారిదే. దేవునితో ఏ ఆత్మ సంబంధము ఆ ఆత్మకే. సమయమున్నప్పుడు సువార్త వినవచ్చును, రక్షణలో ప్రవేశించవచ్చును. కనుక సమయమున్నప్పుడే సిద్ధపడవలయును. ఒకరన్నారు – మొదటి రాకడవలన నేర్చుకొని సిద్ధపడేవారు రెండవ రాకడ విషయంలో ఆందోళనపడనవసరం లేదని. పాఠాలన్ని బాగా చదివి సిద్ధంగా ఉన్నవారికి పరీక్షలెప్పుడు వస్తేనేం, దిద్దేదెవరైతేనేం!

4. సిద్ధంగా ఉంటం సరిపడేదానికంటే కొంత అదనంగా ఉండాలి. కేవలం లోకంద్రుష్టిలో సరిపోయే బాహ్యక్రియలు చేయటంవల్ల పెళ్ళికుమారుని ఎదుర్కొనటానికి కావలసిన కృప కలుగదు.

### ముగింపు

ఎందరో అంత్యకాల ప్రవక్తలు ఇదిగో రాకడ సమీపమై ఉందని భయపడుతుంటారు. రాకడ తమకాలంలోనే వస్తుందని ఆది క్రైస్తవులు కూడా ఎదురు చూచారు. శతాబ్దాల తరబడి చూస్తున్నారు. రాకడ ఎప్పుడనేది ముఖ్యంకాదు. నేడు, ఈ క్షణం, మనకిచ్చిన దేవుని కృపాసమృద్ధిని వినియోగించి మారుమనస్సు పొంది, ఆయన మార్గములో నిలిచిన వారికి రెండవ రాకడ ఈ క్షణంలో వచ్చినా ఆనందమే. సిద్దెలో అదనపు నూనెగల కన్యకల వలె సిద్ధంగా ఉందాం.

**వచ్చే మాసం : పది ధన్యతలు**



## చందాదారుల వివరాలు

| | |
|---|---|
| శ్రీమతి కె. సుభద్ర, విజయవాడ | రూ. 2,000 |
| శ్రీ కెల్లి ఐజక్ సుకుమార్, ఒంగోలు, ప్రకాశం జిల్లా | రూ. 2000 |
| శ్రీమతి పి. అనిత, ఇచ్ఛాపురం, శ్రీకాకుళం జిల్లా | రూ. 1,200 |
| కుమారి జయదేవి, గుంటూరు | రూ. 1,000 |
| శ్రీమతి ఆర్. జయమ్మలాబాను, గుంతకల్ | రూ. 1,000 |
| శ్రీమతి సి.హెచ్.సుభాషిణి, గుడివాడ, కృష్ణాజిల్లా | రూ. 1000 |
| శ్రీ కె. ఐజక్ ఒంగోలు, ప్రకాశం జిల్లా | రూ. 1000 |
| పేరు తెలీదు (21-2-18 తేది) బ్యాంక్ అకౌంట్ | రూ. 1000 |
| శ్రీమతి రాజ్యలక్ష్మి, భోపాల్ | రూ. 1000 |
| శ్రీమతి రత్నకుమారి, కరీంనగర్ | రూ. 500 |
| శ్రీ పరుసు వెంకటరావు, బెంగుళూరు | రూ. 500 |
| శ్రీ పి. యేసుబాబు లోకేష్, ఎర్రంపల్లి, ప.గో.జిల్లా | రూ. 500 |
| శ్రీ పి. దేవదానం, నగరంపాలెం, గుంటూరు | రూ. 500 |
| కుమారి లీనా, బెంగుళూరు | రూ. 500 |
| శ్రీ వి. యోహాను, వనపర్తి, మహబూబ్‌నగర్‌జిల్లా | రూ. 500 |
| శ్రీమతి కె.లూధియ, గోగులమూడి, గుంటూరుజిల్లా | రూ. 500 |
| శ్రీ యం. నిర్మల్‌కుమార్, అనంతపురం | రూ. 500 |
| శ్రీ ఎ. శ్రీనివాసరెడ్డి, హైదరాబాద్ | రూ. 500 |
| కుమారి యం. విక్టోరియారాణి, యర్రగొండపాలెం | రూ. 500 |
| శ్రీ ఏ. పరిశుద్ధ రాజు, నరసాపురం | రూ. 500 |
| పాస్టర్.టి.రమేష్ అబ్రాహాము, పెన్నాడ, ప.గోజిల్లా | రూ. 500 |
| శ్రీ పి. ఇమ్మానియేలు, విజయవాడ | రూ. 500 |
| శ్రీమతి గ్రేస్ మంజుల, బెంగళూర్ | రూ. 500 |
| పేరు తెలీదు (తేది12-10-17) బ్యాంక్ అకౌంట్ | రూ. 400 |
| పాస్టర్ పి. సత్యానందం, మౌలాలి, హైదరాబాద్ | రూ. 300 |
| పాస్టర్ జి. నల్లయ్య, కందుకూరు, ప్రకాశంజిల్లా | రూ. 300 |
| శ్రీ కె. సురేష్, ఉప్పరపల్లె, కడప జిల్లా | రూ. 300 |
| శ్రీ టి. నాగరాజు, చీమకుర్తి, ప్రకాశంజిల్లా | రూ. 300 |
| శ్రీ ఐ. అనిల్‌కుమార్, కాకినాడ, తూ.గో.జిల్లా | రూ. 300 |
| శ్రీమతి వి.శారాభాయి, భీమవరం | రూ. 300 |
| శ్రీమతి యం. పుల్లమ్మ, కడప | రూ. 300 |
| శ్రీ బాలాజీరావు సింథియా, వైజాగ్ | రూ. 300 |
| కుమారి షెఫేలా, దొనకొండ, ప్రకాశం జిల్లా | రూ. 300 |
| శ్రీ కె. ఉజ్జీవరాజు, వనపర్తి, మహబూబ్‌నగర్‌జిల్లా | రూ. 250 |
| శ్రీ ఆర్. ఇన్నయ్య, గుంతకల్లు | రూ. 200 |
| శ్రీ టి. చిన్నా, మల్కిపురం, తూ.గో.జిల్లా | రూ. 200 |
| శ్రీమతి బి. ప్రేమలత, కడప | రూ. 200 |
| శ్రీమతి కె. వాణికుమారి, చీరాల, ప్రకాశంజిల్లా | రూ. 200 |
| శ్రీ డి. సుమన్, రుద్రాంగి, కరీంనగర్‌జిల్లా | రూ. 200 |
| పాస్టర్ పి. కొర్నేలి, మామిళ్ళపల్లి, ప్రకాశంజిల్లా | రూ. 200 |
| శ్రీమతి జి. లీలారాణి, ఒంగోలు, ప్రకాశంజిల్లా | రూ. 200 |
| శ్రీ బి. నాగభూషణం, వెంకటగిరి, నెల్లూరుజిల్లా | రూ. 200 |
| శ్రీ పి. దేవదానం, పెదదోర్నాల, ప్రకాశంజిల్లా | రూ. 200 |
| కుమారి కె. లక్ష్మిప్రియ, ఒంగోలు | రూ. 200 |
| శ్రీ కె. దుర్గాప్రసాద్, రాజమండ్రి | రూ. 200 |
| శ్రీ పి. గిద్యోను, నేరేడ్‌మెట్, హైదరాబాద్ | రూ. 200 |
| శ్రీ వై. జోసఫ్, భీమవరం, ప.గో.జిల్లా | రూ. 200 |
| శ్రీమతి టి.నిర్మలశాంసన్, వెలిగండ్ల, ప్రకాశంజిల్లా | రూ. 200 |
| శ్రీమతి కె. ప్రేమారూత్, గుంటూరు | రూ. 200 |
| శ్రీ కె. జెకర్యా, నర్సీపట్నం, విశాఖపట్నజిల్లా | రూ. 200 |
| శ్రీమతి యం. అరుణకుమారి, విశాఖపట్నం | రూ. 200 |
| శ్రీ కె. యెషయా, ఆర్.జి.పురం, ప్రకాశంజిల్లా | రూ. 200 |
| శ్రీమతి టి. సుమలత, ఆర్.జి.పురం, ప్రకాశంజిల్లా | రూ. 200 |
| శ్రీమతి ఎన్. సరోజిని, నెల్లూరు | రూ. 200 |
| శ్రీమతి జి. రోజమ్మ, చీరాల, ప్రకాశం జిల్లా | రూ. 200 |
| శ్రీమతి సి.హెచ్. పుష్పారాణి, కాకినాడ | రూ. 200 |
| శ్రీ కె. లాజరస్, కొయ్యలగూడెం, ప.గో.జిల్లా | రూ. 200 |
| శ్రీ యం.శ్రీకర్‌కుమార్, జజ్జూరు, కృష్ణాజిల్లా | రూ. 200 |
| శ్రీ ఆర్. శ్రీనివాస్, రావులపాలె, తూ.గో.జిల్లా | రూ. 200 |
| శ్రీ పి. దేవదానం, నగరంపాలెం, గుంటూరు | రూ. 200 |
| శ్రీ యం. ఐజక్, దాసన్నపేట, విజయనగరం | రూ. 200 |
| శ్రీమతి కె. హేమాబాబ్జి, భీమవరం | రూ. 200 |
| శ్రీమతి జె.డి. సుహాసిని ,రాజమండ్రి,తూ.గో జిల్లా | రూ. 200 |
| శ్రీ సి.హెచ్.రామక్రిష్ణ, ఏలూరు, ప.గో జిల్లా | రూ. 200 |
| శ్రీ కె.రవికుమార్, హైదరాబాదు | రూ. 200 |
| శ్రీ కె.వి.వి.రమణ, గండేపల్లి, తూ.గో జిల్లా | రూ. 200 |
| శ్రీ యం. అబ్రాహాము, తాడేపల్లి, గుంటూరు | రూ. 200 |
| పేరు తెలీదు (తేది.7-4-18), బ్యాంకు అకౌంట్ | రూ. 200 |
| పేరు తెలీదు (తేది.15-4-18), బ్యాంకు అకౌంట్ | రూ. 200 |
| శ్రీ టి. మరియబాబు, గొర్జిపాడు, ప్రకాశంజిల్లా | రూ. 200 |
| శ్రీమతి బి. కళ్యాణి, బెంగుళూరు | రూ. 200 |
| పాస్టర్ బి. నెహెమ్యా, చిన్నగంజాం, ప్రకాశంజిల్లా | రూ. 200 |
| యు. మేరి సలోమి, సిరివెళ్ళ, కర్నూలు జిల్లా | రూ. 200 |
| శ్రీ కె. సందీప్‌తేజ, సూళ్ళూరుపేట, నెల్లూరుజిల్లా | రూ. 200 |
| శ్రీ పి. జగదీష్, మధిర, ఖమ్మం జిల్లా | రూ. 200 |
| శ్రీ యల్. నాగరాజు, నంధ్యాల, కర్నూలు జిల్లా | రూ. 200 |
| శ్రీ యస్. గోపి, పార్వతిపురం,విజయనగరం జిల్లా | రూ. 200 |
| శ్రీ యస్. విద్యాసాగర్, ఆత్మకూరు,కర్నూలు జిల్లా | రూ. 200 |
| శ్రీమతి కె. లలిత భాగ్యం, కనిగిరి, ప్రకాశం జిల్లా | రూ. 200 |
| పేరు తెలీదు (7-2-19 తేది) బ్యాంక్ అకౌంట్ | రూ. 200 |
| శ్రీ ఐ. రాజ్‌కుమార్, గుంటూరు | రూ. 200 |
| శ్రీమతి.టి. సూర్యకుమారి, మహబూబ్ నగర్ | రూ. 200 |
| శ్రీ కొట్టె కమల్, శ్రీరాంపురం, ఆదిలాబాద్ | రూ. 150 |

పాస్టర్ జె. జయరాములు, కాకినాడ రూ. 150
పాస్టర్ ప్రకాశం, నారాయణపురం, వరంగల్‌జిల్లా రూ. 150
శ్రీ కె.జె. జ్యోతిరాజ్, మార్కాపురం రూ. 150
శ్రీ పి. ఆనంద్‌సాగర్, కాకినాడ రూ. 150
పాస్టర్ వి.ఎ.యన్.ప్రసాద్, జద్దుర్ల రూ. 150
పాస్టర్ టి. విజయపాల్, నరసరావుపేట రూ. 150
శ్రీమతి బి. ఎస్తేర్‌రాణి, గోగులమూడి, గుంటూరు జిల్లా రూ. 150
పాస్టర్ టి. ఆదాము, శంకవరప్పాడు, ప్రకాశంజిల్లా రూ. 150
పాస్టర్ ఎ మత్తయ్య, వినుకొండ, గుంటూరు జిల్లా రూ. 150
శ్రీ పి. చిన్నారావు, విజయవాడ, కృష్ణాజిల్లా రూ. 150
శ్రీమతి పి. విజయలక్ష్మి, ఎర్రగొండపాలెం, ప్రకాశం జిల్లా రూ. 150
శ్రీ టి. సునీల్‌కుమార్, కోవెరపాలెం, నెల్లూరుజిల్లా రూ. 150
శ్రీమతి వై. కెజియాసత్యసారధి, హైదరాబాద్ రూ. 150
వి. మేరినిర్మల, మెట్రోపాలిటన్ మిషన్, విజయవాడ రూ. 150
శ్రీ టి. మధుసూధన్, గుంటూరు రూ. 150
పాస్టర్ బి. జెకర్యా, రావిపాడు, ప్రకాశం జిల్లా రూ. 100

**మనియార్డరు ద్వారా, నెట్ బ్యాంకింగ్ ద్వారా డబ్బు ట్రాన్స్‌ఫర్ చేసిన వారు తప్పని సరిగా మాకు ఫోన్ చేసి తెలియజేయాలి. లేనిచో వారి పేరు చందాదారుల లిస్టులో ఉండదు. చందాకట్టిన వారిలో ఎవరి పేరైనా లేనిచో దయచేసి 9440217726 నంబరుకి ఫోన్ చేయమని కోరుచున్నాము.**

**బైబిల్ క్విజ్ - 47 ప్రశ్నలకు జవాబులు వ్రాసిన వారు :**


1) **శ్రీమతి ఆర్.జయమ్మలాబాను,** గుంతకల్లు
2) **శ్రీమతి వై. కెజియా సత్యసారధి,** హైదరాబాద్
3) కె. **ప్రేమారూత్,** గుంటూరు
4) **కుమారి షారోన్ కీర్తన,** ఒంగోలు, ప్రకాశం జిల్లా
5) **కుమారి లక్ష్మీప్రియ,** ఒంగోలు, ప్రకాశం జిల్లా
6) **శ్రీమతి యల్. చంద్రలీల,** జె.కొటాలపల్లి, కడప జిల్లా
7) కె. **దేవిడ్‌రాజు,** ఎ.కొత్తపల్లి, తొండంగి(మం), తూ.గో.జిల్లా
8) కె. **బెంజిమాన్,** విజయవాడ, కృష్ణా.జిల్లా

## బైబిల్ క్విజ్ - 47 జవాబులు

**1.**యాకోబు (యెహెజ్కేలు 28:25) **2.**రెల్లుపుల్ల (29:6) **3.**సీను(30:15) **4.**అష్షూరీయులు(31:3) **5.** దోషము (32:27) **6.**ఖడ్గము(33:27) **7.**34:16 **8.**ఎదోము(35:15) **9.**36:23 **10.**37:26 **11.**మహాకంపము (38:19) **12.**ఏడు నెలలు (39:12) **13.**యిరువది మూరలు (40:49) **14.**నూరు మూరలు (41:13) **15.**500బారలు (42:16) **16.**ఏడు (43:26) **17.**44:12 **18.**ఏడు (45:21) **19.**ముప్పది మూరలు (46:22) **20.** దమస్కు (47:17)

## ఈ నెల ప్రశ్న -జూన్-2019

**ఎవరి యెడల జనులు గౌరవము చూపకపోయిరి?**
(విలాపవాక్యములు) (రెఫరెన్సు తప్పని సరిగా ఉండాలి)




మీ జవాబు ఈ నెల 20వ తేదీ లోపు మీ పేరు, పత్రిక సీరియల్ నంబరుతో 9440217726 నంబరుకి **SMS** ద్వారా పంపించాలి. సరైన సమాధానం పంపిన వారిలో 'లక్కిడిప్' ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి రూ.125/–లు విలువ చేసే **'ఆంధ్రక్రైస్తవ ఉజ్జీవ కీర్తనలు'** అనే 1000 పాటలు ఉన్న పుస్తకము బహుమతిగా ఇవ్వబడుతుంది. అయితే ఈ అవకాశం **'చందాదారులకు మాత్రమే'**. అనగా చందా చెల్లించిన వారు మాత్రమే ఈ ప్రశ్నకు జవాబు పంపించాలి. 20వ తేది లోపు చందా చెల్లించే వారు కూడా పాల్గొనవచ్చును.

**మే నెల ప్రశ్నకు జవాబు పంపించిన వారు**
జవాబు : బబులోను (యిర్మియా 51:8)

1) శ్రీమతి.ఆర్. జయమ్మలాబాను, గుంతకల్లు
2) కుమారి.కె. లక్ష్మీప్రియ, ఒంగోలు ప్రకాశం జిల్లా
3) శ్రీమతి వై.కెజియా సత్యసారధి, హైదరాబాద్

### పొడుపు కథ

**"అది నాన్న బొమ్మ నీకెందుకమ్మా
అత్తవారింట అది ఉండతగదమ్మా"**

సమాధానం : రాహేలు

### ప్రకటన

**క్రైస్తవ కథలు, వ్యాసాలు, రచనలు, కవితలు, పాటలు మొదలగునవి మా ప్రియ పాఠకుల నుండి కోరడమైనది. ఆసక్తి గలవారు తమ తమ భావాలను మా పత్రిక ద్వారా పాఠకులకు అందించవచ్చు. ఉత్తమ కథకు నగదు బహుమానం వుంటుంది. క్రైస్తవకథ ఏదైనా 2 పేజీలకు మించకూడదు.**



# అక్షరయజ్ఞం

## బైబిల్ క్విజ్ - 48

( యెహెజ్కేలు 48, దానియేలు, హోషేయ 1 నుండి 7వరకు)



శ్రీమతి కె. ప్రసన్న పరాక్రమ్

1. కాదేషులోనున్న ఏ ఊటల వరకు గాదీయుల సరిహద్దు? (యెహెజ్కేలు 48అ)
2. నపుంసకుల అధిపతి దానియేలుకు ఏమని పేరు పెట్టెను? (దానియేలు 1అ)
3. బబులోని జ్ఞానులను నశింపజేయుటకు రాజు ఎవరిని నియమించెను? (2అ)
4. "ఆయన తన దూతనంపి తన్నాశ్రయించిన దాసులను రక్షించెను" రిఫెరెన్స్ ఏమిటి? (3అ)
5. "భూ నివాసులందరు ఆయన దృష్టికి ఎన్నికకు రాని వారు" రిఫెరెన్స్ ఏమిటి? (4అ)
6. సింహాసనమునకెక్కినప్పుడు దర్యావేషు వయస్సు ఎంత? (5అ)
7. తన దేవునియందు భయభక్తులు గలవాడైనందున అతనికి ---- కలుగలేదు. పూరించండి (6అ)
8. ఆయన రాజ్యము ఎన్నడును --- కాదు. (7అ)
9. అతడు అతిశయపడి తన్నుతాను -----. (8అ)
10. ప్రాయశ్చిత్తం చేయుటకు పరిశుద్ధ పట్టణమునకు ఎన్ని వారాలు విధించబడెను? (9అ)
11. కోరెషు పరిపాలనలో ఎన్నవ సం॥ము దానియేలుకి దర్శనము కలిగెను? (10అ)
12. దక్షిణ దేశపు రాజకుమార్తె ఏ రాజు నొద్దకు వచ్చును? (11అ)
13. ఎన్ని దినములు తాళుకొని కనిపెట్టుకొనువాడు ధన్యుడు? (12అ)
14. లోరూహామా అనగా నేమి? (హోషేయ 1అ)
15. ఆకోరు లోయను ----- గా చేసెదను.(2అ)
16. ఏమి కోరి ఇశ్రాయేలీయులు ఇతర దేవతలను పూజించిరి? (3అ)
17. నా జనులు --- లేనివారై నశించుచున్నారు. (4అ)
18. ఎఫ్రాయిము పిలిచుకొనిన రాజు పేరేమిటి? (5అ)
19. ఏది పాపాత్ముల పట్టణమాయెను? (6అ)
20. "వారు అక్కరకు రాని విల్లు వలె ఉన్నారు" రిఫరెన్స్ ఏమిటి? (7అ)

**గమనిక :-** మీ జవాబులను **SMS/Whatsapp**ద్వారా కూడా పంపవచ్చును. **SMS/Whatsapp** ద్వారా పంపేవారు మీ పేరు, అడ్రస్ లేబుల్ మీద ఉన్న సీరియల్ నంబరుతో **"బైబిల్ క్విజ్-48"** అని టైపు చేసి, ప్రశ్న నంబరు, జవాబు, బైబిల్ రెఫరెన్సుతో జవాబులన్నీ ఒకే మేసేజ్‌లో 9440217726 నంబరుకు పంపాలి. పోస్టుకార్డు లేదా ఎన్వలప్ కవరు ద్వారా జవాబులు (తెల్లపేపరు మీద, అడ్రస్ లేబుల్ మీద ఉన్న సీరియల్ నంబరు, మీ ఫోన్ నంబరు వ్రాసి) పంపదలచిన వారు ఈ నెల 20వ తేదిలోపు **పరిశుద్ధత-బైబిల్ క్విజ్, పోస్ట్‌బాక్స్ నెం.28, ఒంగోలు-523001** అడ్రసుకు పంపగలరు.

**అన్ని ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాసిన వారిలో ఒకరికి "నా దూత" (బాప్తిస్మమిచ్చు యోహాను కథ) అను పుస్తకము (వెల రూ. 50/-) లక్కిడిప్ ద్వారా ఎంపిక చేసి ఉచితంగా పంపబడును**

**గమనిక :** ఈ ప్రశ్నలన్నిటికి సమాధానాలు బైబిలు నుండి గ్రహించవచ్చును. మీరు ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొనటం ద్వారా బైబిలు జ్ఞానమును సంపాదించాలన్నదే మా ఉద్దేశ్యం.